Circulated to Telangana
Published from Jagitial

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU

PRGI REGD NO: TGTEL/25/A1385

దినపత్రిక

www.evarthalu.com

సోమవారం
MONDAY
14-9-2026

జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00

సంపుటి: 2 Volume:2 | సంచిక: 77 Issue: 77


పాఠకులు, ఏజెంట్లు, ప్రకటన కర్తలు, శ్రేయోభిలాషులకు వినాయక చవితి శుభాకాంక్షలు

నేడు మా కార్యాలయానికి సెలవు. కాబట్టి మంగళవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.
-శ్రావణ్ కుమార్ బొమ్మకంటి
ఎడిటర్, పబ్లిషర్

14 సెప్టెంబర్ 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:07 సూర్యాస్తమయం - సా. 6:15 తిథి తదియ ఉ. 7:07 వరకు తరువాత చవితి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం చిత్తా మ. 1:53 వరకు తరువాత స్వాతి యోగం బ్రహ్మ మ. 12:40 వరకు కరణం గరజి ఉ. 7:07 వరకు వనిజ రా. 7:25 వరకు వర్జ్యం రా. 7:51 నుండి రా. 9:33 వరకు దుర్ముహూర్తం మ. 12:36 నుండి మ. 1:24 వరకు మ. 3:01 నుండి మ. 3:50 వరకు రాహుకాలం ఉ. 7:38 నుండి ఉ. 9:09 వరకు యమగండం ఉ. 10:40 నుండి మ. 12:11 వరకు గుళికాకాలం మ. 1:42 నుండి మ. 3:13 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:31 నుండి తె. 5:19 వరకు అమృత ఘడియలు ఉ. 7:17 నుండి ఉ. 8:57 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:35 వరకు గమనిక: "౦" అనగా మరుసటి రోజున




# ముదిరాజులను బీసీ-ఏలో చేర్చాలి

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 13 (ఈవార్తలు): ముదిరాజులు, మత్స్యకారుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా ముదిరాజ్, మత్స్యకార సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం వేములవాడలో భారీ మహార్యాలీ నిర్వహించారు. పట్టణంలోని సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం వద్ద ప్రారంభమైన ర్యాలీ బద్దిపోచమ్మ ఆలయం వరకు కొనసాగింది. వేలాది మంది ముదిరాజులు, మత్స్యకారులు తరలిరావడంతో పట్టణం నినాదాలతో మార్మోగింది. మత్స్యకారుల ఆటపాటలు, ముదిరాజుల సాంస్కృతిక వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ర్యాలీ అనంతరం గాంధీ, తెలంగాణ తల్లి, అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను క్యాంపు



కార్యాలయంలో కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు పిట్టల భూమేష్ మాట్లాడుతూ తరతరాలుగా దేశ రక్షణలో, సైనిక సేవల్లో కీలక పాత్ర పోషించిన ముదిరాజులు, మత్స్యకారులు నేడు రాజకీయ, సామాజిక సాధికారతకు దూరంగా తీవ్ర పేదరికంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘాల నాయకులు సారుగు నరేష్, రేగుల మల్లికార్జున్, రేగుల రాజకుమార్, పంబల దేవరాజు, తునికి నరేష్, పెండ్యాల శంకర్, తునికి నరసయ్య, యమ తిరుపతి, రేగుల నారాయణ, బండ్ల సత్యం, చిగురు నరేష్, పండుగ రమేష్, రేగుల రాజేశం, పెండ్యాల తిరుపతి, రెడ్డివేణి పర్శరాము, కంకణాల శేఖర్, పండుగ స్వామి, పిట్టల విటల్, తునికి మల్లయ్య, పిట్టల వెంకటేశం, ఏంబరి దేవరాజు, తుపాకుల రవి, రణవేణి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## అంబీ చెరువులో నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 13 (ఈవార్తలు): హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనానికి చేపట్టాల్సిన ఏర్పాట్లను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఆదివారం పరిశీలించారు. నిమజ్జన కొలను వద్ద జరుగుతున్న పనులతో పాటు భక్తులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సీయంసీ ఇంజినీరింగ్ విభాగం, ఇతర శాఖల అధికారులు, సీఐ విజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ రాజు, మాజీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, దొడ్ల వెంకటేష్‌గౌడ్‌లతో కలిసి ఆయన సమీక్షించారు. నిమజ్జనం సందర్భంగా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం తదితర అంశాలపై అధికారులు చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో చిరుమర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

## దంచికొడుతున్న వానలు

### పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (ఈవార్తలు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. రానున్న రెండ్రోజులు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వాతావరణ శాఖ అంచనా ప్రకారం.. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్‌తో పాటు నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో వర్షాలు పడతాయని తెలిపింది. ఈ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది. వర్షాల కారణంగా ఉత్తర తెలంగాణలోని ప్రాజెక్టులకు వరద నీరు వచ్చి చేరుతోంది. ఆసిఫాబాద్ జిల్లాలోని వట్టివాగు, కుమరం భీం ప్రాజెక్టుల్లోకి 2,172 క్యూసెక్కుల వరద వస్తుండగా, అధికారులు 1,378 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో రైతులు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఇక హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై, తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

## ఏపీ టెట్ ఫలితాలు విడుదల

విజయవాడ, సెప్టెంబర్ 13 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు శుభవార్త. ఏపీ టెట్-2026 జూన్ కు సంబంధించిన ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదివారం విడుదల చేశారు. ఈ పరీక్షలో ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు 51 శాతం ఉత్తీర్ణత సాధించగా, సాధారణ అభ్యర్థులు 47 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ.. టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులందరికీ, ముఖ్యంగా ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. "ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు తమ అకడమిక్ నైపుణ్యాన్ని, నిబద్ధతను మరోసారి నిరూపించుకున్నారు. మీ కృషి, అంకితభావం ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయి" అని ఆయన ప్రశంసించారు. అదే సమయంలో, ఈసారి అర్హత సాధించలేకపోయిన అభ్యర్థులు నిరాశ చెందవద్దని లోకేశ్ భరోసా ఇచ్చారు. "విజయం అనేది ఒక గమ్యం కాదు, అదొక ప్రయాణం. కాబట్టి పట్టుదలతో ప్రయత్నిస్తూనే ఉండండి" అని వారికి ధైర్యం చెప్పారు. లక్ష్యసాధన కోసం కృషి కొనసాగించాలని సూచించారు.

## ప్రైవేటు వాహనాల అనుమతిపై టీటీడీ క్లారిటీ

తిరుమల, సెప్టెంబర్ 13 (ఈవార్తలు): బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల ప్రైవేట్ వాహనాలపై ఆంక్షలు విధిస్తున్నట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తీవ్రంగా ఖండించింది. ఈ వార్తలు పూర్తిగా అవాస్తవమని, భక్తులు ఇలాంటి నిరాధారమైన వదంతులను నమ్మవద్దని స్పష్టం చేసింది. కొంతకాలంగా సోషల్ మీడియా వేదికగా, "తిరుమలకు రోజుకు కేవలం 15,000 ప్రైవేట్ వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని, ఆ సంఖ్య దాటిన తర్వాత వచ్చే వాహనాలను అలిపిరి చెక్‌పాయింట్ వద్దే నిలిపివేస్తారు" అంటూ వార్తలు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ ప్రచారం భక్తుల్లో తీవ్ర గందరగోళానికి, ఆందోళనకు కారణమైంది. ఈ నేపథ్యంలో టీటీడీ స్పందిస్తూ ఓ అధికారిక ప్రకటన విడుదల చేసింది. తిరుమలకు వచ్చే ప్రైవేట్ వాహనాల సంఖ్యపై ఎలాంటి పరిమితులు విధించే నిర్ణయం తీసుకోలేదని తేల్చిచెప్పింది. ప్రస్తుతం వాహనాల రాకపోకలపై ఎటువంటి కొత్త ఆంక్షలు అమలులో లేవని పునరుద్ఘాటించింది. టీటీడీకి సంబంధించిన ముఖ్యమైన నిర్ణయాలను, అధికారిక సమాచారాన్ని కేవలం టీటీడీ అధికారిక వెబ్‌సైట్, శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ ద్వారా మాత్రమే వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. వాస్తవాలు నిర్ధారించుకోకుండా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసి భక్తులను అయోమయానికి గురిచేయడం సరికాదని హితవు పలికారు. టీటీడీ పేరుతో ఇలాంటి అసత్య ప్రచారాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పర్యావరణ హితమే.. మట్టి వినాయకుల పంపిణీ

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 13 (ఈవార్తలు): పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ఆల్విన్ కాలనీ ఫేజ్-2 సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వినాయక విగ్రహాల తయారీలో కృత్రిమ రంగులు, విషపూరిత పదార్థాలు వినియోగించడం వల్ల నీరు, వృక్ష,



జంతు జీవవ్యవస్థలపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రజలు మట్టి గణనాథులను పూజించాలని కోరారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, కట్టా శ్రీనివాస్, నరసింహాచారి, సుధాకర్, శ్రీకాంత్, శ్రీను, సాయి ప్రభాకర్, రమేష్, వివేక్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా సైమా-2026 వేడుకలు

### ఉత్తమ నటుడిగా నాగ చైతన్య.. మిరాయ్‌కి అవార్డుల పంట






బెంగళూరు: దక్షిణాది సినీ పరిశ్రమలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే 'సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్' (సైమా - 2026) వేడుక కర్ణాటక రాజధాని బెంగళూరులో కన్నుల పండువగా జరిగింది. కోరమంగళ ఇండోర్ స్టేడియం వేదికగా వేడుకలు అట్టహాసంగా జరిగాయి. 'తండేల్' సినిమాలో కఠిన శ్రమతో కూడిన పాత్రలో అద్భుత ప్రతిభ చూపినందుకు గానూ నాగచైతన్య 'ఉత్తమ నటుడు' పురస్కారాన్ని దక్కించుకున్నారు. 'మిరాయ్'తో పాటు ఇతర తెలుగు చిత్రాల నటీనటులు, సాంకేతిక నిపుణులు కూడా పురస్కారాలను అందుకున్నారు. విభిన్న కుటుంబ కథాంశంతో మెప్పించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంలో సహజ నటనకు గానూ ఐశ్వర్య రాజేశ్ 'ఉత్తమ నటి (క్రిటిక్స్)' అవార్డును దక్కించుకోగా, అదే సినిమాలోని నటనకు బుల్లిరాజు (భీమల రేవంత్) 'ఉత్తమ హాస్య నటుడు' అవార్డును గెలుచుకున్నారు. హిట్ మెషీన్ అనిల్ రావిపూడి ఉత్తమ దర్శకుడిగా, సీనియర్ సింగర్ రమణ గోగుల ఉత్తమ నేపథ్య గాయకుడుగా అవార్డులు అందుకున్నారు. 'కింగ్డమ్' చిత్రంతో మెప్పించిన సత్యదేవ్ 'ఉత్తమ సహాయ నటుడు' అవార్డును, 'డాకు మహారాజ్' సినిమాకు గానూ శ్రద్ధా శ్రీనాథ్ 'ఉత్తమ సహాయ నటి' పురస్కారాన్ని అందుకున్నారు. 'కోర్ట్' సినిమా ద్వారా సమీరా భరద్వాజ్ (ఉత్తమ నేపథ్య గాయని), హర్ష్ రోషన్ (ఉత్తమ పరిచయ నటుడు), శ్రీదేవి (ఉత్తమ పరిచయ నటి) అవార్డులను గెలుచుకోగా, 'మోగ్లీ' చిత్రానికి సాక్షి మడోల్కర్ ఉత్తమ పరిచయ నటిగా అవార్డును అందుకున్నారు.



**మిరాయ్‌కు 4 అవార్డులు**

టాలీవుడ్ సూపర్ హీరో ఫాంటసీ చిత్రం 'మిరాయ్' అవార్డుల పంట పండించింది. నాలుగు ప్రధాన విభాగాల్లో పురస్కారాలను కైవసం చేసుకుని వేదికపై ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన 'మిరాయ్' చిత్రం విజువల్ వండర్‌గా సినీ ప్రియులను అలరించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు సైమా వేదికపై ఏకంగా నాలుగు కీలక కేటగిరీల్లో విజయదుందుభి మోగించింది. చిత్రం విడుదలై సరిగ్గా ఏడాది పూర్తయిన సందర్భంలోనే తేజ సజ్జా తన ప్రతిభకు గుర్తింపుగా ఉత్తమ నటుడి పురస్కారాన్ని అందుకోవడం విశేషం. విలన్‌గా విలక్షణ నటన కనబరిచిన మంచు మనోజ్, తన కెమెరా మాయాజాలంతో ప్రేక్షకులను కట్టిపడేసిన కార్తీక్ ఘట్టమనేని అవార్డులను అందుకోవడంతో యూనిట్ ఆనందంలో మునిగిపోయింది. అలాగే అనిల్ రావిపూడి- వెంకటేష్ కాంబినేషన్లో వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీ కూడా వివిధ కేటగిరీల్లో పలు అవార్డుల్ని దక్కించుకుంది. ఉత్తమ వినోదాత్మక చిత్రం, ఉత్తమ దర్శకుడు,ఉత్తమ నటి -క్రిటిక్స్, ఉత్తమ హాస్యనటుడు, ఉత్తమ నేపథ్య గాయకుడు కేటగిరీల్లో 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీ అవార్డుల్ని ఎగరేసుకుని పోయింది.

**ఉత్తమ చిత్రం (2025): 'మిరాయ్' (పీపుల్ మీడియా ఫ్యాక్టరీ)**

**ఉత్తమ నటుడు (క్రిటిక్స్ - సూపర్‌హీరో): తేజ సజ్జా**

**ఉత్తమ సినిమాటోగ్రాఫర్: కార్తీక్ ఘట్టమనేని**

**ఉత్తమ ప్రతినాయకుడు (విలన్ రోల్): మంచు మనోజ్**

# పిడుగుపాటుతో నలుగురు మృతి

నరసరావుపేట, సెప్టెంబర్ 13 (ఈవార్తలు): పల్నాడు జిల్లాలో పిడుగుపాటుకు గురై నలుగురు వ్యక్తులు మరణించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం, దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పండుగపూట నాలుగు కుటుంబాల్లో తీరని విషాదం నెలకొనడం తనను తీవ్రంగా కలచివేసిందని అన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, వారిని ఆదుకుంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.అసలేం జరిగింది? పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. ఈ ప్రకృతి బీభత్సంలో పిడుగులు పడి వేర్వేరు గ్రామాలకు చెందిన నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలతో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.మృతుల వివరాలు.. నరసరావుపేట మండలంలోని పెట్లూరివారిపాలెం గ్రామానికి చెందిన తలపనేని నాగమ్మ (63) ఇంటి సమీపంలోని కొబ్బరిచెట్టుపై పిడుగు పడింది. ఆ తీవ్రమైన శబ్దానికి భయపడి గుండెపోటుకు గురైన ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. అదేవిధంగా, కాకాని శివారు లక్ష్మీపురం గ్రామానికి చెందిన మేకల వెంకాయమ్మ (60) కూడా తన ఇంటి వద్ద పిడుగు పడిన భారీ శబ్దానికి గుండె ఆగి మరణించారు. మరో రెండు ఘటనల్లో, పాలపాడు గ్రామానికి చెందిన రైతు దేరంగుల వెంకటయ్య, యాకలవారిపాలెంకు చెందిన మరో రైతు మజ్జిగ చిన్న కోటేశ్వరరావు పిడుగుపాటుకు నేరుగా గురై ప్రాణాలు విడిచారు. పొలాల్లో పనుల్లో ఉన్న సమయంలో ఈ దుర్ఘటనలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ పిడుగుల కారణంగా రెండు వేర్వేరు గ్రామాల్లో మూడు ఆటోలు, పలు కొబ్బరి, మామిడి చెట్లు కూడా దెబ్బతిన్నట్లు స్థానిక అధికారులు తెలిపారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.




## హాకీలో భారత్ కేక

### జూనియర్ హాకీలో హవా

**- పురుషులు, మహిళల జట్లకు స్వర్ణాలు**

బీజింగ్: ఆసియా కప్ జూనియర్ హాకీ టోర్నమెంట్‌లో భారత మహిళల జట్టు, పురుషుల జట్టు స్వర్ణాలు సాధించాయి. చైనాతో జరిగిన ఫైనల్‌లో భారత మహిళా జట్టు 1-0 తేడాతో గెలుపొందింది. మ్యాచ్‌లో నమోదైన ఏకైక గోల్‌ను భారత క్రీడాకారిణి సానిక చంద్రకాంత్ మనే 17వ నిమిషంలో సాధించింది. భారత మహిళల జట్టు ఈ కప్‌ను గెలుచుకోవడం ఇది వరుసగా మూడోసారి కావడం విశేషం. 2023 ఎడిషన్‌లో దక్షిణ కొరియాను ఓడించి తొలి టైటిల్ సాధించిన భారత్.. 2024 ఎడిషన్‌లో చైనాను మట్టికరిపించి రెండోసారి విజేతగా నిలిచింది. తాజాగా ఆసియా కప్ ఛాంపియన్‌గా అవతరించిన భారత జట్టు జూనియర్ ప్రపంచ కప్‌లో స్థానాన్ని ఖరారు చేసుకుంది. స్వర్ణ పతకాలు సాధించిన భారత పురుషుల, మహిళల బృందానికి హాకీ ఇండియా నగదు ప్రోత్సాహం ప్రకటించింది. టైటిల్ నిలబెట్టుకున్న భారత పురుషుల జట్టు ఈ టోర్నమెంట్‌లో పురుషుల విభాగంలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్‌లో భారత్ 4-1 తేడాతో కొరియాను ఓడించింది. భారత్ తరఫున అజిత్ యాదవ్ (9వ నిమిషం), అన్మోల్ (13వ), ప్రభ్‌దీప్‌సింగ్ (21వ), అషు మౌర్య (50వ) గోల్స్ చేశారు. కొరియా ఓటమి ఖాయమైన తర్వాత 54వ నిమిషంలో ఆ జట్టు ప్లేయర్ లీ మిన్-హ్యోక్ గోల్ చేశాడు. ఈ టోర్నీలో భారత్‌కు ఇది వరుసగా నాలుగో టైటిల్ కావడం విశేషం. గత మూడు ఎడిషన్లలో (2015, 2023, 2024) పాకిస్థాన్ ప్రత్యర్థి కాగా.. మూడుసార్లు చిరకాల ప్రత్యర్థిని భారత్ చిత్తుగా ఓడించి ఛాంపియన్‌గా నిలిచింది.

## సారీ చెప్పి ఉంటే సురేఖ పదవి నిలిచేది: కొండా మురళి

వరంగల్, సెప్టెంబర్ 13 (ఈవార్తలు): తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన తర్వాత ఆమె భర్త, కాంగ్రెస్ సీనియర్ నేత కొండా మురళి తొలిసారిగా స్పందించారు. వరంగల్‌లో కాంగ్రెస్ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తాము పార్టీ మారుతున్నామంటూ వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. పదవి కోసం ఆత్మగౌరవాన్ని వదులుకోబోమని, కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. "ఒక్కసారి సారీ చెబితే చాలని నాయకులు సురేఖతో అన్నారు. కానీ, పదవి ఉంటే ఉండనీ, పోతే పోనీ, క్షమాపణ మాత్రం చెప్పనని సురేఖ కరాఖండిగా చెప్పింది" అని మురళి ఆనాటి పరిణామాలను వివరించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామని, తమ విధేయత కాంగ్రెస్ పార్టీకేనని స్పష్టం చేశారు. రాహుల్ వల్లే సురేఖకు ఎమ్మెల్యేగా గెలిచే అవకాశం వచ్చిందని, ఆయన్ను ప్రధానిని చేయడమే తమ లక్ష్యమని కొండా మురళి ప్రకటించారు. "వచ్చే ఎన్నికల్లో గెలుపు గుర్రాలకు మేమే టికెట్లు ఇస్తాం" అంటూ వ్యాఖ్యానించారు.

Circulated to Telangana
Published from Jagitial



# నేటి ఈవార్తలు

NETI EVARTHALU

దినపత్రిక

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

సోమవారం MONDAY 14-9-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 77 Issue: 77

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటన కర్తలు, శ్రేయోభిలాషులకు వినాయక చవితి శుభాకాంక్షలు

నేడు మా కార్యాలయానికి సెలవు. కాబట్టి మంగళవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.
-శ్రావణ్ కుమార్ బొమ్మకంటి
ఎడిటర్, పబ్లిషర్

14 సెప్టెంబర్ 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:07 సూర్యాస్తమయం - సా. 6:15 తిథి తదియ ఉ. 7:07 వరకు తరువాత చవితి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం చిత్తా మ. 1:53 వరకు తరువాత స్వాతి యోగం బ్రహ్మ మ. 12:40 వరకు కరణం గరజి ఉ. 7:07 వరకు వనిజ రా. 7:25 వరకు వర్జ్యం రా. 7:51 నుండి రా. 9:33 వరకు దుర్ముహూర్తం మ. 12:36 నుండి మ. 1:24 వరకు మ. 3:01 నుండి మ. 3:50 వరకు రాహుకాలం ఉ. 7:38 నుండి ఉ. 9:09 వరకు యమగండం ఉ. 10:40 నుండి మ. 12:11 వరకు గుళికాకాలం మ. 1:42 నుండి మ. 3:13 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:31 నుండి తె. 5:19 వరకు అమృత ఘడియలు ఉ. 7:17 నుండి ఉ. 8:57 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:35 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



# ఖైరతాబాద్ గణపయ్య రెడీ

## 69 అడుగుల్లో పంచముఖ సంకటహర గణనాథుడు

### నేడు గవర్నర్ చేతుల మీదుగా తొలి పూజ

### ఆదివారం నుంచే పోటెత్తిన భక్తజనం

ఖైరతాబాద్-హైదరాబాద్, సెప్టెంబర్ 13 (ఈవార్తలు): భాగ్యనగరంలో వినాయక చవితి ఉత్సవాల సందడి అప్పుడే మొదలైంది. ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహాన్ని నిర్వాహకులు ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ ఏడాది 72వ ఉత్సవాల్లో భాగంగా 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకటహర మహాగణపతి' రూపంలో గణనాథుడు కొలువుదీరాడు. విగ్రహాన్ని ఆవిష్కరించిన వెంటనే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకోవడం ప్రారంభించారు. ఈసారి స్వామివారు ఐదు ముఖాలు, ఐదు పడగల సర్పం, బహుళ హస్తాలతో సంకటాలను హరించే రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. గణపతికి ఒకవైపు 15 అడుగుల సోమనాథ జ్యోతిర్లింగం, మరోవైపు కాళికామాత విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పర్యావరణ హితంగా రూపుదిద్దుకున్న ఈ విగ్రహ నిర్మాణంలో సుమారు 30 టన్నుల నదీ మట్టి (రాజస్థాన్ బనాస్ నది నుంచి), 20 టన్నుల ఇసుక, 25 టన్నులకు పైగా స్టీల్‌తో పాటు గడ్డి, సేంద్రియ రంగులను ఉపయోగించారు. ప్రఖ్యాత శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ పర్యవేక్షణలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన 150 మందికి పైగా కళాకారులు మూడు నెలల పాటు శ్రమించి ఈ భారీ విగ్రహాన్ని రూపొందించారు. గత జూన్‌లో కర్రపూజతో పనులు ప్రారంభమయ్యాయి. వినాయక చవితి పర్వదినమైన సోమవారం ఉదయం 10 గంటలకు తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా మహాగణపతికి తొలి పూజ నిర్వహించనున్నారు. ఆ తర్వాత అధికారికంగా భక్తుల దర్శనాలు ప్రారంభమవుతాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా త్వరలో స్వామివారిని దర్శించుకోనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సెప్టెంబర్ 25 వరకు పూజలు కొనసాగనున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు, హైదరాబాద్‌లోని మరో ప్రసిద్ధ గణపతి మండపమైన బాలాపూర్‌లో ఈ ఏడాది పూరీ జగన్నాథ్ ఆలయ థీమ్‌తో మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు.



7

# అమ్మాయిలా మజాకా..!

## ఆసియా కప్ పట్టేశారు!.. శ్రీలంకపై ఘన విజయం

## శ్రీచరణి స్పిన్ మ్యాజిక్.. షఫాలీ, స్మృతి మంధనల మెరుపులు

# 'ఏఐ'ని తగ్గిద్దాం

## టెక్ దిగ్గజాల సంచలన నిర్ణయం

న్యూయార్క్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో పరస్పరం పోటీ పడే దిగ్గజ సంస్థల అధినేతలు ఒక కీలక అంశంపై అనూహ్యంగా ఒకే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అత్యాధునిక ఏఐ మోడళ్ల సామర్థ్యాలను పెంచే వేగాన్ని కొంతకాలం తగ్గించి, భద్రతా చర్యలకు మరింత సమయం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆంత్రోపిక్ సీఈవో డారియో అమోడై, ఓపెన్‌ఏఐ సీఈవో సామ్ ఆల్ట్మాన్, ఎక్స్‌ఏఐ అధినేత ఎలోన్ మస్క్ అభిప్రాయపడ్డారు. మితిమీరిన ఏఐ పురోగతిపై ఆందోళనలను వ్యక్తం చేస్తూ ఆంత్రోపిక్ సీఈవో డారియో అమోడై తాజాగా సుదీర్ఘ పదాల వ్యాసాన్ని ప్రచురించారు. ఇందులో ఏఐ అభివృద్ధిని పూర్తిగా నిలిపివేయాలని కాకుండా, అత్యాధునిక మోడళ్ల సామర్థ్యాలు పెరుగుతున్న వేగాన్ని కొంత తగ్గించాలని ఆయన సూచించారు. అలా చేస్తే ఏఐ భద్రత, నియంత్రణ, ప్రమాదాల అంచనా వంటి అంశాలు సాంకేతిక పురోగతికి అనుగుణంగా ముందుకు సాగేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.



# మేం కాంగ్రెస్‌లోనే పుట్టాం

## వేరే పార్టీలోకి వెళ్లే ఆలోచన లేదు: సురేఖ

కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్టుగా కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారానికి మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే కొండా సురేఖ ఫుల్ స్టాప్ పెట్టారు. ఆ వార్తలన్నీ నిరాధారమైనవని, కేవలం కల్పిత కథనాలని ఆమె కొట్టిపారేశారు. తన భర్త కొండా మురళితో కలిసి ఆదివారం వరంగల్‌లో పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.



వరంగల్, సెప్టెంబర్ 13 (ఈవార్తలు): "మేము కాంగ్రెస్‌లోనే పుట్టాం, కాంగ్రెస్‌లోనే పెరిగాం. మాకు వేరే పార్టీలోకి వెళ్లాలనే ఆలోచన లేదు" అని కొండా సురేఖ తేల్చిచెప్పారు. గతంలో కొన్ని తప్పనిసరి పరిస్థితుల్లో బీఆర్ఎస్‌లోకి వెళ్లాల్సి వచ్చిందని అన్నారు. తమను ఎవరూ బయటకు పంపలేదని గుర్తుచేశారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ కాంగ్రెస్ టికెట్‌పైనే పోటీ చేస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మంత్రివర్గం నుంచి తనను తొలగించడంపై మాట్లాడుతూ.. పదవి పోయినందుకు వ్యక్తిగతంగా ఎలాంటి బాధ లేదని, కానీ ఎందుకు తొలగించారో కారణం చెప్పకపోవడం ఆవేదన కలిగించిందని అన్నారు. మంత్రి పదవి ఒక అలంకారం మాత్రమేనని, తనకు అప్పగించిన మూడు శాఖలను ఎలాంటి అవినీతికి తావులేకుండా నడిపించానని తెలిపారు. పార్టీ మార్పు ప్రచారం నేపథ్యంలో అధిష్ఠానం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, తాను పార్టీ వీడటం లేదని వారికి స్పష్టం చేశానని సురేఖ వెల్లడించారు. ఈ క్రమంలో తన భర్త కొండా మురళికి త్వరలో పదవి ఇస్తామనే సంకేతాలు కూడా అధిష్ఠానం నుంచి వచ్చాయని ఆమె తెలిపారు. రానున్న ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున మళ్లీ గెలిచి, మంత్రిగా తిరిగి వస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 24 నుంచి 25 డివిజన్లలో కాంగ్రెస్‌ను గెలిపించడమే తమ లక్ష్యమని ప్రకటించారు. ఈ సందర్భంగా స్థానిక నేతలపై ఆమె పరోక్షంగా విమర్శలు గుప్పించారు. కనీసం కార్పొరేటర్‌గా కూడా గెలవలేని వారు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వైఎస్ఆర్ మరణం తర్వాత స్థానికంగా ఉన్న కొందరు "గుంటనక్కలు" తమను మోసం చేశారని ఆరోపించారు.

# బ్రిక్స్ గ్రాండ్ సక్సెస్

## దౌత్యపరంగా భారత్ విజయం... పశ్చిమాసియాపై కీలక ఉమ్మడి ప్రకటన

భారత్ అధ్యక్షతన న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన 18వ బ్రిక్స్ సదస్సు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది. ముఖ్యంగా పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో సభ్య దేశాల మధ్య ఉన్న భిన్నాభిప్రాయాలను పక్కనపెట్టి, ఒక బలమైన ఉమ్మడి ప్రకటనపై ఏకాభిప్రాయం సాధించడంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక దౌత్య విజయం సాధించారు. భారత్ చొరవతో రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సు విజయవంతంగా ముగిసింది. సదస్సులో 10 పూర్తిస్థాయి సభ్య దేశాలతో పాటు సౌదీ అరేబియా కూడా పాల్గొంది.



న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ బ్రిక్స్ దేశాలు ఏకగ్రీవంగా సంయుక్త తీర్మానాన్ని ఆమోదించాయి. ఈ తీర్మానంలో ఏ దేశం పేరునూ నేరుగా ప్రస్తావించనప్పటికీ, అన్ని పక్షాలు సంయమనం పాటించాలని, పరిస్థితిని మరింత దిగజార్చే చర్యలకు పాల్పడవద్దని పిలుపునిచ్చాయి. పౌర మౌలిక సదుపాయాలు, అణు కేంద్రాలపై ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న దాడుల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినట్లు 'జపాన్ టైమ్స్' తన కథనంలో హైలైట్ చేసింది. ప్రపంచ వాణిజ్యం, సరఫరా గొలుసులు, ఇంధన ప్రవాహానికి అంతరాయం కలగకుండా చూసేందుకు సమష్టి కృషి అవసరమని ఈ ప్రకటన నొక్కి చెప్పిందని 'అల్ జజీరా' పేర్కొంది. సదస్సు ప్రారంభోపన్యాసంలో ప్రధాని మోదీ, బ్రిక్స్ కూటమికి రాబోయే 20 ఏళ్లకు సంబంధించి ఒక ప్రతిష్టాత్మక విజన్‌తో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తీసుకున్న నిర్ణయాల అమలుకు పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు రష్యా ప్రభుత్వ వార్తా సంస్థ టాస్ నివేదించింది. "గత రెండు దశాబ్దాల్లో బ్రిక్స్ ప్రపంచ వేదికపై తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును ఏర్పరచుకుంది. మనం పరస్పరం ఒకరి అభిప్రాయాలను ఒకరం గౌరవించుకుంటూ, ఏకాభిప్రాయంతో ముందుకు సాగుతున్నాం. ఎవరితోనూ ఘర్షణ ద్వారా కాకుండా, అందరినీ కలుపుకొని అభివృద్ధిని కోరుకుంటున్నాం" అని మోదీ అన్నారు. మరోవైపు, బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ కూడా ఈ సదస్సులో కీలక పాత్ర పోషించింది. వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక, సాంకేతికత, అభివృద్ధి సవాళ్లపై వ్యాపార ప్రముఖులు, మంత్రులు, దేశాధినేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నట్లు యురేషియా రివ్యూ నివేదించింది. బ్రిక్స్ దేశాల మధ్య అంతర్గత వాణిజ్యం, పెట్టుబడులు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), ప్రమాణాల సహకారం వంటి అంశాలపై ఈ ఫోరమ్ సిఫార్సులు సదస్సు ప్రకటనలలో ప్రతిబింబిస్తాయి. ప్రముఖ అమెరికన్ వార్తాపత్రికలు సైతం ఈ సదస్సును మారుతున్న ప్రపంచ క్రమానికి ఒక సూచికగా అభివర్ణించాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల తరఫున ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లలో ఎవరి గొంతు బలంగా వినిపిస్తుందనేది ఈ సదస్సులో ప్రధానాంశమని 'న్యూయార్క్ టైమ్స్' పేర్కొంది. అమెరికాతో భారత్, చైనాల సంబంధాలలో ఉన్న అనిశ్చితి, ఈ రెండు అణ్వస్త్ర పొరుగు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించుకోవడానికి అవకాశం కల్పించిందని 'వాల్ స్ట్రీట్ జర్నల్' విశ్లేషించింది.

# నౌక మునిగి 130 మంది గల్లంతు

## ఇండోనేషియాలో ఘోర నౌక ప్రమాదం

### 107 మందిని కాపాడిన సహాయక బృందాలు

### అలల కారణంగానే నౌక బోల్తా పడిందని వెల్లడి

జావా: ఇండోనేషియాలో ఘోర నౌకా ప్రమాదం జరిగింది. 213 మంది ప్రయాణికు లు, 30 మంది సిబ్బందితో కలిపి మొత్తం 243 మందితో ప్రయాణిస్తున్న 'వర్గో ట్రాన్స్‌పోర్ట్ 8' అనే నౌక జావా సముద్రంలో మునిగిపోయింది. ఈ పెను విషాదంలో ఇప్పటివరకు 107 మందిని సహాయక బృందాలు సురక్షితంగా కాపాడగా, ఆరుగురి మృతదేహాలను వెలికితీశాయి. మరో 130 మంది ఆచూకీ ఇంకా తెలియరాలేదు. వారి కోసం సముద్రంలో గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వివరాల్లోకి వెళితే, తూర్పు జావాలోని సురబయ నుంచి శనివారం బయలుదేరిన ఈ నౌక, దక్షిణ కాలిమంటన్‌లోని బంజర్‌మాసిన్‌కు వెళుతోంది. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో కెప్టెన్ నుంచి అధికారులకు చివరి సందేశం అందింది. సముద్రంలో దాదాపు 3 మీటర్ల ఎత్తున అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయని, దీంతో నౌక ఒకవైపునకు ఒరిగిపోతోందని ఆయన తెలిపారు. ఆ తర్వాత కొద్దిసేపటికే నౌకతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. బంజర్‌మాసిన్ రేవుకు సుమారు 148 కిలోమీటర్ల దూరంలో ఈ దుర్ఘటన జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న వెంటనే సహాయక చర్యలు ప్రారంభమయ్యాయి.

# సీఎం రేవంత్ రోశయ్య జపం

## మాజీ సీఎం వల్లే తెలంగాణకు మిగులు బడ్జెట్

### నా ఎదుగుదలకు గొప్ప సలహాలు ఇచ్చారు

### ఆర్యవైశ్య భవన నిర్మాణ శంకుస్థాపనలో రేవంత్

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (ఈవార్తలు): తెలంగాణ ఏర్పడినప్పుడు రూ.16,000 కోట్ల మిగులు బడ్జెట్‌తో ఆవిర్భవించిందంటే, ఆ ఘనత పూర్తిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకే దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రోశయ్య ముందుచూపు వల్లే 2014 జూన్ 2న తెలంగాణ ధనిక రాష్ట్రంగా ఏర్పడిందని స్పష్టం చేశారు. ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన రోశయ్యకు కాంగ్రెస్ పార్టీ సముచిత గౌరవం ఇచ్చిందని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చెన్నారెడ్డి, విజయభాస్కర రెడ్డి, వై.ఎస్. రాజశేఖర రెడ్డి వంటి ముఖ్యమంత్రులు రాష్ట్ర ఖజానా బాధ్యతలను ఆర్యవైశ్యులకే అప్పగించారని తెలిపారు. రోశయ్య అత్యధిక కాలం ఆర్థిక మంత్రిగా పనిచేసి, 16 సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనతను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రోశయ్యతో తనకున్న అనుబంధాన్ని రేవంత్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. తాను శాసనమండలిలో దూకుడుగా మాట్లాడినప్పుడు, రోశయ్య తనను పక్కకు పిలిచి కోపాన్ని తగ్గించుకుని అనుభవంతో ముందుకు వెళ్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటావని సలహా ఇచ్చారని వెల్లడించారు. రోశయ్య ఎప్పుడూ కఠినంగా విమర్శించలేదని, తన చతురత, వాగ్ధాటితోనే పదునైన వ్యాఖ్యలు చేసేవారని అన్నారు.





# 6 లేన్లుగా హైదరాబాద్-విజయవాడ హైవే

## భూసేకరణకు నోటిఫికేషన్

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (ఈవార్తలు): హైదరాబాద్-విజయవాడ మధ్య ఉన్న ఎన్‌హెచ్-65ను ఆరు వరుసలుగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. రహదారి విస్తరణకు అవసరమైన భూమిని సేకరించే ప్రక్రియను కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారుల శాఖ ప్రారంభించింది. ఇందులో భాగంగా నల్గొండ జిల్లాలోని ఒక కీలక సెక్షన్‌కు సంబంధించి భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేసింది. జాతీయ రహదారుల చట్టం-1956లోని సెక్షన్ 3ఏ(1) కింద ఈ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. నల్గొండ జిల్లాలోని 62.20 కిలోమీటర్ నుంచి 126.800 కిలోమీటర్ వరకు ఉన్న ఎన్‌హెచ్-65 సెక్షన్‌ను ఆరు వరుసలుగా విస్తరించేందుకు భూసేకరణ చేపట్టనున్నారు. దీంతో హైదరాబాద్-విజయవాడ మార్గంలో ప్రయాణించే వాహనాలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు రాకపోకల సామర్థ్యం పెరగనుంది. భూసేకరణలో భాగంగా చిట్యాల, నార్కెట్‌పల్లి, కట్టంగూర్, నకిరేకల్, కేతేపల్లి మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో భూములను సేకరించనున్నారు. వెలిమినేడు, వట్టిమర్తి, చిట్యాల, నార్కెట్‌పల్లి, యల్లారెడ్డిగూడెం, చెరువుగట్టు, పామనగుండ్ల, దుగ్నేవల్లి, అయిటిపాముల, చందంపల్లి, నకిరేకల్, కొర్లపహాడ్, ఇనుపాముల గ్రామాల్లోని 70 సర్వే నంబర్ల పరిధిలో భూములు ఈ ప్రక్రియలోకి రానున్నాయి. మొత్తంగా 6.32 హెక్టార్ల వ్యవసాయ, వ్యవసాయేతర భూములను సేకరించేందుకు అధికారులు ప్రతిపాదించారు. భూసేకరణకు సంబంధించి భూ యజమానులు, ఇతర హక్కుదారులకు అభ్యంతరాలు ఉంటే నోటిఫికేషన్ వెలువడిన 21 రోజుల్లోగా సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారికి తెలియజేయవచ్చు. అందిన అభ్యంతరాలను అధికారులు పరిశీలించి, అవసరమైన విచారణ చేపట్టిన అనంతరం తుది భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.






# జిన్‌పింగ్‌కు అలసట.. మోదీ ఆరా!

న్యూఢిల్లీ: న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఒక ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగాన్ని మధ్యలోనే ఆపి, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆరోగ్యం గురించి వాకబు చేశారు. ఈ ఘటన శనివారం సదస్సు ప్రారంభ సెషన్‌లో జరిగింది. మోదీ ప్రసంగిస్తుండగా, వేదికపై ఉన్న జిన్‌పింగ్ కాస్త అసౌకర్యంగా కనిపించడాన్ని గమనించారు. వెంటనే ప్రసంగానికి విరామం ఇచ్చి, జిన్‌పింగ్ వైపు తిరిగారు. ఆయన పక్కనే ఉన్న అనువాదకుడిని ఉద్దేశించి, “ఆయన బాగున్నారా?” అని మోదీ ప్రశ్నించారు. కొద్ది క్షణాల తర్వాత మరోసారి అదే ప్రశ్న అడగగా, జిన్‌పింగ్ తలూపి ఫర్వాలేదని సూచించారు. అనంతరం మోదీ తన ప్రసంగాన్ని తిరిగి కొనసాగించారు. ఈ దృశ్యాలు దూరదర్శన్ ప్రసారం చేసిన ఫుటేజీలో రికార్డ్ అయ్యాయి. అయితే, జిన్‌పింగ్ అసౌకర్యానికి గురికావడానికి గల కారణాలు వెంటనే తెలియరాలేదు. దాదాపు ఏడేళ్ల తర్వాత జిన్‌పింగ్ భారత్‌లో పర్యటిస్తున్నారు. ఈ ఘటన తర్వాత ఇరు నేతలు ద్వైపాక్షిక సమావేశంలో కూడా పాల్గొన్నారు. కాగా, సదస్సు అనంతరం ప్రధాని మోదీ ఏర్పాటు చేసిన గాలా డిన్నర్‌కు జిన్‌పింగ్ హాజరుకాలేదు. వరుస కార్యక్రమాలతో అలసిపోవడంతో ఆయన విశ్రాంతి కోసం హోటల్‌కు తిరిగి వెళ్లినట్లు సమాచారం.

## రెండున్నర రోజుల్లో

రష్యా, చైనా అధ్యక్షులు సహా ప్రపంచ నేతలతో చర్చలు

# మోదీ 15 భేటీలు!

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దౌత్యపరంగా తనదైన శైలిని, అలుపెరగని శక్తిని మరోసారి ప్రదర్శించారు. ఢిల్లీలోని భారత్ మండపం వేదికగా విజయవంతంగా ముగిసిన 18వ బ్రిక్స్ సదస్సు, ఆయన నిబద్ధతకు అద్దం పట్టింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు కేవలం రెండున్నర రోజుల వ్యవధిలో, ప్రధాని మోదీ ఏకంగా 15 ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించి తన దౌత్య వేగాన్ని చాటుకున్నారు. ఈ అధికారిక సమావేశాలే కాకుండా, బ్రిక్స్ సదస్సు సెషన్లు, ఔట్‌రీచ్ సమావేశాల మధ్యలో పలువురు ప్రపంచ నేతలు, అంతర్జాతీయ సంస్థల అధిపతులతో కూడా ఆయన అనేక పుల్-అసైడ్ (అనధికారిక) సమావేశాల్లో పాల్గొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో చర్చలతో ప్రధాని మోదీ ఈ దౌత్య మారథాన్‌ను ప్రారంభించారు. అదే రోజు సాయంత్రం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్‌లతో వేర్వేరుగా భేటీ అయ్యారు. శనివారం ఉదయం హైదరాబాద్ హౌస్‌లో ఇథియోపియా ప్రధాని అబియ్ అహ్మద్ అలీతో చర్చలతో రోజును ప్రారంభించిన మోదీ, ఆ తర్వాత మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలీద్ బిన్ మహమ్మద్, వియత్నాం ప్రధాని లే మిన్ హంగ్‌లతో వరుసగా సమావేశమయ్యారు. అనంతరం బ్రిక్స్ సదస్సులో పాల్గొని, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో కీలక ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. సదస్సులో భాగంగా ‘భారత్ ఇన్నోవేట్స్’ ఎగ్జిబిషన్‌ను తిలకించడం, నేతలతో కలిసి



మొక్కలు నాటడం వంటి కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. ఆదివారం కూడా ప్రధాని సమావేశాల పరంపర ఆగలేదు. బ్రిక్స్ భాగస్వామ్య, ఔట్‌రీచ్ దేశాల నేతలతో భేటీ అనంతరం, కజకిస్థాన్ ప్రధాని, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు, ఈజిప్ట్ అధ్యక్షుడు, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు, బురుండి అధ్యక్షుడు, నైజీరియా ఉపాధ్యక్షుడు, ఉగాండా ఉపాధ్యక్షురాలితో ఒకరి తర్వాత ఒకరితో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. మొత్తం మీద, బ్రిక్స్ సదస్సు వేదికగా ప్రధాని మోదీ చూపిన చొరవ, ఆయన జరిపిన వరుస సమావేశాలు ప్రపంచ దేశాలతో సంబంధాలను బలోపేతం చేయాలన్న భారత్ సంకల్పాన్ని మరోసారి స్పష్టం చేశాయి.

## చైనా ముందు వ్యూహాత్మక లొంగుబాటు

### మోదీపై కాంగ్రెస్ విమర్శనాస్త్రాలు

న్యూఢిల్లీ: చైనా విషయంలో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ల ద్వైపాక్షిక సమావేశం జరిగిన మరుసటి రోజే, కేంద్రంపై ప్రశ్నల వర్షం కురిపించింది. చైనా ముందు మోదీ సర్కార్ “వ్యూహాత్మకంగా లొంగిపోతోందని” కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. చైనా విషయంలో ప్రభుత్వ మాటలకు, చేతలకు ఏమాత్రం పొంతన లేదని ఆయన విమర్శించారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతతలే ఇరు దేశాల మధ్య సత్సంబంధాలకు అత్యంత కీలకమని చైనా అధ్యక్షుడికి ప్రధాని మోదీ స్పష్టం చేసిన మరుసటి రోజే కాంగ్రెస్ ఈ విమర్శలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు జియో నెట్‌వర్క్ స్లైసింగ్ టెక్నాలజీ

గ్యాలరీల్లో రద్దీని అంచనా వేసేందుకు 200 ఏఐ ఆధారిత కెమెరాలు



తిరుమల, సెప్టెంబర్ 13 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు టీటీడీ ఈసారి భద్రత విషయంలో సాంకేతికతకు పెద్దపీట వేస్తోంది. లక్షలాదిగా తరలివచ్చే భక్తుల రద్దీని సమర్థంగా నియంత్రించడం, అత్యవసర సమయాల్లో కమ్యూనికేషన్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా చూడటం లక్ష్యంగా అధునాతన టెక్నాలజీలను ప్రవేశపెడుతోంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత కెమెరాలు, నెట్‌వర్క్ స్లైసింగ్ వంటి టెక్నాలజీలతో భద్రతా వ్యవస్థను మరింత పటిష్ఠం చేస్తోంది. గరుడ సేవ వంటి ప్రధాన ఘట్టాల సమయంలో మాడ వీధులకు సుమారు 3.5 లక్షల మంది భక్తులు వస్తారని టీటీడీ అంచనా వేస్తోంది. ఇంత భారీ రద్దీ ఉన్నప్పుడు సాధారణ మొబైల్ నెట్‌వర్క్‌లు పనిచేయకపోవడం, వాకీటాకీల ఫ్రీక్వెన్సీలు ఓవర్‌ల్యాప్ కావడం వంటి సమస్యలు తలెత్తుతాయి. దీనిని అధిగమించేందుకు జియోతో కలిసి ప్రయోగాత్మకంగా ‘నెట్‌వర్క్ విథిన్ ది నెట్‌వర్క్’ పేరుతో నెట్‌వర్క్ స్లైసింగ్ టెక్నాలజీని అమలు చేస్తోంది. దీని కింద 30 అధునాతన కమ్యూనికేషన్ పరికరాలను ఏర్పాటు చేశారు. సాధారణ సిగ్నల్స్ జామ్ అయినా, ఈ పరికరాలు కమాండ్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానమై పనిచేస్తాయి. 11 కీలక సబ్-కంట్రోల్ పాయింట్ల వద్ద ఉన్నతాధికారులకు వీటిని అందించనున్నారు. గ్యాలరీల్లో భక్తుల రద్దీని కచ్చితంగా అంచనా వేసేందుకు ఈసారి తొలిసారిగా ఏఐ, సాఫ్ట్‌వేర్ ఆధారిత హెడ్ కౌంటింగ్ కెమెరాలను వినియోగిస్తున్నారు. ఇందుకోసం దాదాపు 200 కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్యాలరీలను గ్రిడ్లుగా విభజించి, ప్రతి గ్రిడ్‌లో ఉన్న భక్తుల సంఖ్యను ఈ కెమెరాలు రియల్ టైంలో లెక్కిస్తాయి. ఏదైనా గ్యాలరీ సామర్థ్యానికి మించి నిండిపోతే, వెంటనే అప్రమత్తమై భక్తులను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించేందుకు ఇది దోహదపడుతుంది.



# బ్రిక్స్ వేదికగా యూఎన్ చీఫ్ శాంతి మంత్రం

## ప్రపంచానికి శాంతి అత్యవసరమని పిలుపు

### గాజా, ఉక్రెయిన్, సూడాన్ సంక్షోభాలపై తీవ్ర ఆందోళన

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు తీవ్ర ఘర్షణలతో సతమతమవుతున్న వేళ, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ ప్రపంచ శాంతికి పిలుపునిచ్చారు. న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. గాజా నుంచి మధ్యప్రాచ్యం, ఉక్రెయిన్, సూడాన్ వరకు ప్రపంచానికి శాంతి అత్యవసరమని నొక్కి చెప్పారు. సమ్మిళిత ప్రపంచ వృద్ధికి శాంతి పునాది అని, అది లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఈ సదస్సులో ప్రత్యర్థి దేశాలైన ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, సౌదీ విదేశాంగ మంత్రి ఫైసల్ బిన్ ఫర్హాన్ అల్ సౌద్, అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలీద్ బిన్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ వంటి మధ్యప్రాచ్య నేతలు ఒకే వేదికపై ఉండటం గమనార్హం. వీరితో పాటు ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రారంభించి ఆహార, ఎరువుల సంక్షోభానికి కారణమైన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ నేతలందరినీ ఉద్దేశించి గుటెర్రస్ మాట్లాడుతూ.. “ప్రతి దేశం ఐరాస చార్టర్, అంతర్జాతీయ చట్టాలకు లోబడి తమ బాధ్యతలను గౌరవించాలి. దేశాల సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత, రాజకీయ స్వాతంత్ర్యం వంటి సూత్రాలను పాటించాలి. వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవడంతో పాటు, అంతర్జాతీయ మానవతా, మానవ హక్కుల చట్టాలకు కట్టుబడి ఉండాలి” అని హితవు పలికారు. గుటెర్రస్ శాంతి పిలుపునకు బ్రిక్స్ కూటమి సానుకూలంగా స్పందించింది. శనివారం ఆమోదించిన ఉమ్మడి ప్రకటనలో పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గాజాలో కాల్పుల విరమణ పాటించాలని, పాలస్తీనియన్ల హక్కులను కాపాడాలని కోరింది. అలాగే సూడాన్‌లో క్షీణిస్తున్న పరిస్థితి, మానవతా సంక్షోభంపై ఆందోళన వ్యక్తం చేస్తూ తక్షణమే శాశ్వత కాల్పుల విరమణకు పిలుపునిచ్చింది. ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా నేతలు ఈ ప్రకటనపై సంతకాలు చేయడం దౌత్యపరమైన ముందడుగుగా భావిస్తున్నారు. అయితే, గాజా, సూడాన్‌పై స్పందించిన బ్రిక్స్ కూటమి.. ఉక్రెయిన్ యుద్ధంపై మాత్రం తమ ఉమ్మడి ప్రకటనలో ఎలాంటి ప్రస్తావన చేయకపోవడం గమనార్హం. గత ఏడాది బ్రెజిల్‌లో జరిగిన సదస్సులో కనీసం దీనిపై ప్రస్తావించిన కూటమి, ఈసారి పూర్తిగా మౌనం పాటించడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది.

# మోదీ విందుకు జిన్‌పింగ్ గైర్హాజరు



న్యూఢిల్లీ: న్యూఢిల్లీ వేదికగా జరిగిన 18వ బ్రిక్స్ సదస్సులో ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఏర్పాటు చేసిన గాలా డిన్నర్‌కు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరుకాలేదు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో పాటు ఇతర దేశాధినేతలు ఈ విందులో పాల్గొన్నారు. జిన్‌పింగ్ గైర్హాజరుపై చర్చ మొదలైనప్పటికీ, ఆయన విశ్రాంతి తీసుకునేందుకే హోటల్‌కు వెళ్లారని తెలిసింది. సదస్సులో పాల్గొని, ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపిన అనంతరం జిన్‌పింగ్ అలసట కారణంగా విశ్రాంతి తీసుకున్నట్లు సమాచారం. ఆయనతో పాటు అబుధాబి క్రౌన్ ప్రిన్స్ కూడా సదస్సు ముగిశాక స్వదేశానికి తిరిగి వెళ్లడంతో విందుకు గైర్హాజరయ్యారు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరిగిన ఈ సదస్సులో 11 సభ్య దేశాలు, 10 భాగస్వామ్య దేశాలు పాలుపంచుకున్నాయి. ఇదిలా ఉండగా, ఈ సదస్సులో “న్యూఢిల్లీ డిక్లరేషన్ 2026”ను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. “ఈ డిక్లరేషన్‌పై ఏ సభ్య దేశం అభ్యంతరం చెప్పలేదు. ఇది చర్చల సారాంశాన్ని ప్రతిబింబిస్తూ, ఉమ్మడి లక్ష్యాలకు స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుంది” అని ప్రధాని వివరించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నియంత్రణ, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సీ) సంస్కరణలు, ఉగ్రవాదాన్ని ఖండించడం వంటి కీలక అంశాలు ఈ డిక్లరేషన్‌లో ఉన్నాయి. వచ్చే ఏడాది బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను చైనా చేపడుతుందని జిన్‌పింగ్ ఇదే సదస్సులో ప్రకటించారు.



ఈవార్తలు
వినోదవాణి
CINEMA
సోమవారం 14-9-2026, జగిత్యాల
www.evarthalu.com


## లవ్లీ చిత్రం



మంజరి ఫడ్నీస్




## బెత్లహేమ్ కుటుంబ యూనిట్.. 300 కోట్లు

మలయాళీ చిత్రం.. నివిన్ పౌలీ హీరోగా నటించిన -బెత్లహేమ్ కుటుంబ యూనిట్- బాక్సాఫీస్ వద్ద రికార్డులను బద్దలు కొట్టింది. కేవలం 23 రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన వసూళ్లను సాధించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఈ సినిమాలో ఇటీవల సూర్య సరసన వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న లక్కీ గాళ్ మమితా బైజు కథానాయికగా నటించడం ఈ చిత్రానికి మరింత ప్లస్ అయింది. ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా మలయాళంలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల సరసన నిలిచింది. కేవలం రూ. 30 కోట్ల బడ్జెట్‌తో అత్యంత సాధారణంగా తెరకెక్కిన ఈ చిత్రం.. మౌత్ టాక్‌తో పుంజుకుని ఏకంగా రూ. 300 కోట్ల గ్రాస్ కలెక్షన్ల మైలురాయికి చేరువ కావడం విశేషం. సెప్టెంబర్ 4న తెలుగులోనూ విడుదలైన ఈ సినిమా అన్ని భాషల్లోనూ అద్భుతమైన ఆదరణను దక్కించుకుంది. ఈ భారీ విజయం ద్వారా సినీ పరిశ్రమకు ఒక స్పష్టమైన సందేశం లభించిందని చెప్పవచ్చు. పెద్ద పెద్ద స్టార్ హీరోల సినిమాలు.. భారీ మార్కెట్ ఉన్న ఇమేజ్ కంటే బలమైన కంటెంట్ ఉంటేనే ప్రేక్షకులు ఏ రేంజ్‌లో నెత్తిన పెట్టుకుంటారనేదానికి -బెత్లహేమ్ కుటుంబ యూనిట్- విజయమే నిదర్శనం. కథలో దమ్ముంటే చిన్న బడ్జెట్ సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద ఏ స్థాయి సునామీ సృష్టించగలదో ఈ చిత్రం నిరూపించింది. సినిమా విడుదలై ఇన్ని రోజులు గడిచినా నైట్ షోలలో ఏకంగా 73.17 శాతం ఆక్యుపెన్సీ నమోదు కావడం దీనికి నిలువెత్తు సాక్ష్యం.

## కంబ్యాక్ ఇచ్చిన హీరోయిన్ తల్లి

సీనియర్ నటి మేనక సురేష్ సుదీర్ఘ విరామం తర్వాత మళ్ళీ మలయాళ చిత్రసీమలోకి పునరాగమనం చేయడం విశేషం. -ఒరు కొరియన్ కన్ఫ్యూజన్- అనే వినూత్న శీర్షికతో తెరకెక్కుతున్న చిత్రం ద్వారా మేనక మాలీవుడ్ లో రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఎనభైల నాటి తరం ప్రేక్షకులను సహజసిద్ధమైన నటనతో అలరించిన మేనక మళ్ళీ వెండితెరపై కనిపించబోతుండటంతో అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మేనక సురేష్ మలయాళ సినీ చరిత్రలో తనకంటూ ప్రత్యేకమైన ముద్రను వేసుకున్నారు. 1980వ దశకంలో



ఎన్నో చిత్రాల్లో నటించి విజయాలు అందుకున్నారు. ఎంతో మంది స్టార్ హీరోలతో తెరను పంచుకున్నారు. అప్పటి తరం ప్రేక్షకులకు మేనక అందించిన పాత్రలు ఇప్పటికీ నటనకు చిరునామాగా నిలిచాయి. కుటుంబ కథా చిత్రాలకు , భావోద్వేగ ప్రాధాన్యత ఉన్న పాత్రలకు మేనక పెట్టింది పేరుగా ఓ వెలుగు వెలిగారు. కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్న సమయంలోనే నిర్మాత జి. సురేష్ కుమార్‌ను వివాహం చేసుకుని అటుపై నటనకు కొంతకాలం విరామం ఇచ్చారు. కుటుంబ బాధ్యతలు నెరవేర్చడం.. పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో మేనక ప్రధాన పాత్ర పోషించారు. దీంతో పరిశ్రమకు దూరమయ్యారు. అయినా చిత్ర పరిశ్రమతో ఉన్న అనుబంధం, సినిమాపై ఉన్న మక్కువ ఆమెలో ఎప్పుడూ తగ్గిపోలేదనడానికి ఈ పునరాగమనమే నిదర్శనం. మేనక సురేష్ నటనతో పాటు ఆమె కుటుంబం కూడా మలయాళ సినీ జగత్తులో ఎంతో పేరు సంపాదించింది.

## 'ఫెమినిజం'పై తప్పుడు అభిప్రాయాలు

టాలీవుడ్ యంగ్ బ్యూటీ పాయల్ రాధాకృష్ణ 'హ్యాపీ జర్నీ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. అభిరామ్ నాయుడు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అన్నపూర్ణమ్మ, ఆమని, యాంకర్ ఝాన్సీ, జినీషా అలిశెట్టి, రూపా శ్రీనివాస్, సునైనా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఏడుగురు మహిళలు కలిసి చేసే యూరప్ ట్రిప్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా పూర్తిగా భావోద్వేగభరితంగా సాగుతుంది. అన్ని పనులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 18న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ తాజాగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో పాయల్ రాధాకృష్ణ మాట్లాడిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలోచక్కర్లు కొడుతున్నాయి. సినిమాలో పోస్టర్లు చూసి కేవలం అమ్మాయిల ప్రయాణం మాత్రమే అనుకోవద్దని, కానీ కథ క్లైమాక్స్‌లోకి వెళ్లేసరికి వారి జీవితాల్లోకి అబ్బాయిల ప్రాధాన్యత ఏంటో తెలుస్తుందని ఆమె చెప్పారు. ఫెమినిజం అంటే అబ్బాయిలను వ్యతిరేకించడం కాదని, నేటి సమాజంలో కొందరు దీని అర్థాన్ని పూర్తిగా తప్పుగా అర్థం చేసుకుంటున్నారని పాయల్ అభిప్రాయపడ్డారు. ఈ సృష్టిలో అమ్మాయి ఉండాలంటే అబ్బాయి ఉండాలని, అలాగే అబ్బాయి ఉండాలంటే అమ్మాయి అవసరం ఉంటుందని, అదే అసలైన జీవిత సౌందర్యమని ఆమె పేర్కొన్నారు.



## నా పోస్టర్లను చెప్పులతో కొట్టారు

'బేబీ' చిత్రంతో ఒక్కసారిగా టాలీవుడ్‌లో సెన్సేషన్ సృష్టించి ఓవర్ నైట్ స్టార్‌గా పేరు తెచ్చుకున్న యంగ్ బ్యూటీ వైష్ణవి చైతన్య ఇటీవల 'ఎపిక్' మూవీతో మరోసారి థియేటర్ల ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో, తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆమె తన కెరీర్ తొలినాళ్లలో ఎదుర్కొన్న చేదు అనుభవాలను, ముఖ్యంగా 'బేబీ' సినిమా సమయంలో వచ్చిన విపరీతమైన నెగెటివిటీని గుర్తు చేసుకుంటూ ఎమోషనల్ అయ్యారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. తనకు 'బేబీ' సినిమాతో ఒక్క రాత్రిలో ఎలాంటి సక్సెస్ రాలేదని వైష్ణవి స్పష్టం చేశారు. కవర్ సాంగ్స్, షార్ట్ ఫిలిమ్స్, పలు చిత్రాల్లో చిన్న చిన్న క్యారెక్టర్ రోల్స్ చేస్తూ ఎంతో కష్టపడి ఇక్కడికి చేరుకున్నానని ఆమె తెలిపారు. అయితే సినిమా విడుదలైన తర్వాత కొందరు తనను ఉద్దేశించి నోటికి వచ్చినట్లు గలీజ్‌గా మాట్లాడారని, థియేటర్ల వద్ద తన పోస్టర్లపై చెప్పులతో కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో ఆ దృశ్యాలన్నీ చూశాక ఎంతో బాధపడ్డానని తెలిపారు. సినిమా సూపర్ హిట్ అయిందని సంతోషించాలా? లేక తాను పడిన కష్టానికి ఈ రకమైన అవమానాలే బహుమతిగా వస్తున్నాయని బాధపడాలా? అనే తీవ్రమైన మానసిక వేదనలోకి వెళ్లిపోయానని వైష్ణవి అన్నారు. అయితే కాలం మారుతున్న కొద్దీ ఆ నెగెటివిటీ గురించి పట్టించుకోవడం మానేశానని, కేవలం తన పనిపై, సానుకూల అంశాలపై మాత్రమే దృష్టి పెట్టడం మొదలుపెట్టానని ఆమె వివరించారు.





## నేడు హనుమాన్ అంశ్ టీజర్ రిలీజ్




జాతీయ స్థాయిలో ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలై, బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన చిత్రం ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. 'హనుమాన్ అంశ్ - ఆంజనేయుడి అవతారం' పేరుతో రానున్న ఈ సినిమా తెలుగు టీజర్‌ను సోమవారం ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ప్రముఖ దర్శకుడు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈ చిత్రాన్ని తెలుగులో సమర్పిస్తుండటం విశేషం. ఆయన సమర్పణలో ఫార్చ్యూన్ 4 సినిమాస్ సంస్థ ఈ సినిమాను సెప్టెంబర్ 18న తెలుగు రాష్ట్రాల్లో భారీ ఎత్తున విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేస్తూ, టీజర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. ఈ చిత్రం ప్రఖ్యాత ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా (మహరాజ్‌జీ) జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కింది. విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించగా, శోభినవ్ సత్య ప్రధాన పాత్రలో నటించి మెప్పించారు. హిందీలో కేవలం రూ. 2 కోట్ల నామమాత్రపు బడ్జెట్‌తో నిర్మించిన ఈ సినిమా, అనూహ్యంగా రూ. 200 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది.

## జయమ్మ పాత్ర గొప్పది

విజయ్ దేవరకొండ, క్రేజీ బ్యూటీ రష్మిక మందన్న జంటగా నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. టాలెంటెడ్ డైరెక్టర్ రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ బడ్జెట్ చిత్రంపై టాలీవుడ్‌లో ఇప్పటికే విపరీతమైన అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ పూర్తి భిన్నమైన యోధుడి పాత్రలో కనిపించ నుండగా, రష్మిక మందన్నా 'జయమ్మ' అనే శక్తివంతమైన పాత్రలో అలరించబోతున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధిం చి రష్మిక మందన్నా తన వంతు షూటింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక ఎమోషనల్ పోస్ట్ షేర్ చేస్తూ సినిమాపై తన అనుభవాలను పంచుకున్నారు. 'రణబాలి' చిత్రంలో జయమ్మగా తన పాత్రకు సంబంధించిన షూటింగ్ పార్ట్ ముగిసిందని, ఈ జర్నీ తన కెరీర్‌లో ఎప్పటికీ గుర్తుండిపోతుందని ఆమె తెలిపారు. జయమ్మ పాత్ర కేవలం ఒక సినిమాలోనిది కాదని, అది ప్రతి ఒక్కరి మనసులను హత్తుకునేలా ఉంటుందని రష్మిక పేర్కొన్నారు. రాబోయే అక్టోబర్ 16న థియేటర్లలో 'రణబాలి' సినిమా చూసినప్పుడు ప్రేక్షకులకు కూడా సరిగ్గా ఇదే భావనలుగుతుందని ఆమె గట్టిగా ఆశిస్తున్నట్లు తెలిపారు.

## అజిత్-విజయ్ ఆత్మీయ కలయిక

బ్రిటన్‌లోని ప్రసిద్ధ సిల్వర్‌స్టోన్ సర్క్యూట్‌లో ఒక అరుదైన.. చారిత్రాత్మక దృశ్యం ఆవిష్కృతమైంది. తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సి. జోసెఫ్ విజయ్ అధికారిక పర్యటనలో భాగంగా సిల్వర్‌స్టోన్ సర్క్యూట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ రేసింగ్‌లో పాల్గొంటున్న అజిత్ కుమార్‌ను విజయ్ ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్న క్షణాలు సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారి... కోట్లాది మంది అభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. 60 ఏళ్ల వయసులోనూ -తలా- అజిత్ అంతర్జాతీయ రేసింగ్‌లో చూపుతున్న తెగువ... సాధిస్తున్న విజయాలు చూసి మాస్ యూత్ ఫ్యాన్స్ ఉప్పొంగుతున్నారు.







# అభిషేక్ విధ్వంసం

## తేలిపోయిన ఆఫ్ఘన్.. తొలి టీ20 టీమిండియాదే

**ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో టీమిండియా 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపులో యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగిన తీరు ప్రధాన ఆకర్షణగా నిలిచింది.**

కేవలం 32 బంతుల్లోనే 7 ఫోర్లు, 7 భారీ సిక్సర్లతో 82 పరుగులు చేసి, ఆఫ్ఘన్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతని విధ్వంసకర ఇన్నింగ్స్‌తో భారత్ లక్ష్యాన్ని మరో 38 బంతులు మిగిలి ఉండగానే సునాయాసంగా ఛేదించింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్, ఆఫ్ఘనిస్థాన్‌ను ఓ మోస్తరు స్కోరుకే పరిమితం చేసింది.

అనంతరం 157 పరుగుల లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్ సంజూ శాంసన్ (10) తక్కువ స్కోరుకే ఔటయ్యాడు. అయితే, మరో ఎండ్ లో అభిషేక్ శర్మ, ఆఫ్ఘన్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. మొదటి నుంచి దూకుడు మంత్రాన్ని జపించి, బౌలర్ ఎవరనేది చూడకుండా బౌండరీల వర్షం కురిపించాడు. ముఖ్యంగా భారత ఇన్నింగ్స్‌లో పవర్‌ప్లేలో అభిషేక్ ఆడిన తీరు మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసింది. అతని ధాటికి పవర్‌ప్లే ముగిసే సరికి భారత్ వికెట్ నష్టానికి 82 పరుగులు చేసింది. ఆఫ్ఘన్ ప్రధాన బౌలర్లైన ఫజల్‌హక్ ఫరూఖీ, రషీద్ ఖాన్‌లను కూడా లక్ష్యంగా చేసుకుని భారీ షాట్లు ఆడాడు. అతని బ్యాటింగ్ చూసి ఆఫ్ఘన్ కెప్టెన్ నిస్సహాయంగా చూడటం తప్ప ఏమీ చేయలేకపోయాడు. 256.25 స్ట్రైక్ రేట్‌తో పరుగులు సాధించి, టీ20 క్రికెట్‌లో అసలైన విధ్వంసం ఎలా ఉంటుందో చూపించాడు. మరో ఎండ్‌లో ఉన్న ఇషాన్ కిషన్ (33 బంతుల్లో 42) అతనికి చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ కలిసి రెండో వికెట్‌కు కేవలం 53 బంతుల్లోనే 121 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ భాగస్వామ్యంలో అభిషేక్ పూర్తి ఆధిపత్యం చెలాయించగా, ఇషాన్ నిలకడగా ఆడుతూ అతనికి స్ట్రైక్ రొటేట్ చేశాడు. శతకం దిశగా సాగుతున్నట్టు కనిపించిన అభిషేక్, మహమ్మద్ నబీ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించి రషీద్ ఖాన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అప్పటికే భారత్ విజయం ఖాయమైంది. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (8లి), తిలక్ వర్మ (3లి) మిగతా లాంఛనాన్ని పూర్తి చేశారు. అంతకుముందు టాస్ గెలిచిన టీమిండియా కెప్టెన్ బౌలింగ్ ఎంచుకున్నాడు. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో ఆఫ్ఘన్ తీవ్ర కష్టాల్లో పడింది. స్పిన్నర్లు అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి పొదుపుగా బౌలింగ్ చేసి ఒత్తిడి పెంచడంతో అఫ్గాన్ టాప్ ఆర్డర్ చేతులెత్తేసింది. ఒక దశలో 43 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కుప్పకూలిన ఆ జట్టు, ఆల్‌రౌండర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ (64 నాటౌట్) వీరోచిత అర్ధశతకంతో పుంజుకుంది. ఫలితంగా, నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 19 పరుగులకే 3 వికెట్లు పడగొట్టి ఆఫ్ఘన్ పతనాన్ని శాసించాడు. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో టీమిండియా 1-0 ఆధిక్యంలో నిలిచింది. ఇక, ఇరుజట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ సెప్టెంబరు 15న ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలోనే జరగనుంది.





# అమ్మాయిలా మజాకా..!

## ఆసియా కప్ పట్టేశారు!.. శ్రీలంకపై ఘన విజయం

## శ్రీచరణి స్పిన్ మ్యాజిక్.. షఫాలీ, స్మృతి మంధనల మెరుపులు

**మహిళల ఆసియా కప్ 2026 ఫైనల్లో భారత జట్టు అద్భుతమైన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. దుబాయ్ వేదికగా జరిగిన తుది పోరులో శ్రీలంకను 72 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసి రికార్డు స్థాయిలో 8వ సారి ఆసియా ఛాంపియన్‌గా నిలిచింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (68), స్మృతి మంధన (59) బ్యాటింగ్‌లో విధ్వంసం సృష్టిస్తే, యువ బౌలర్ శ్రీ చరణి (4/20) బంతితో మాయ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది.**

**భారత అమ్మాయిల జోరు ముందు లంక జట్టు పోటీ ఇవ్వలేకపోయింది. 184 పరుగుల లక్ష్యఛేదనలో 111 పరుగులకే ఆలౌట్ అయింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టుకు ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధాన అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు.**

లంక బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడ్డారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు కేవలం 12.5 ఓవర్లలోనే 129 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి భారీ స్కోరుకు బలమైన పునాది వేశారు. షఫాలీ 39 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 68 పరుగులు చేయగా, స్మృతి 39 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 59 పరుగులు సాధించింది. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు వేగంగా ఆడటంలో కాస్త తడబడినప్పటికీ, చివర్లో కమలిని కేవలం 5 బంతుల్లోనే ఓ ఫోర్, సిక్సర్‌తో 15 పరుగులు చేసింది. దీంతో భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 183 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. అనంతరం 184 పరుగుల భారీ లక్ష్య ఛేదనతో బరిలోకి దిగిన శ్రీలంకకు ఆరంభంలోనే గట్టి దెబ్బ తగిలింది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు లంక బ్యాటర్లు పరుగులు చేయడానికి



తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. కెప్టెన్ చమరి అటపట్టు (36) కాసేపు పోరాడినా, ఆమె ఔటయ్యాక లంక పతనం వేగవంతమైంది. ముఖ్యంగా, యువ స్పిన్నర్ శ్రీ చరణి తన అద్భుత బౌలింగ్‌తో లంక బ్యాటింగ్ ఆర్డర్‌ను కుప్పకూల్చింది. కీలకమైన హర్షిత, నీలాక్షిక, కవిష, సుగందికల వికెట్లను పడగొట్టి లంకను కోలుకోలేని దెబ్బ తీసింది. కేవలం 20 పరుగులు ఇచ్చి 4 వికెట్లు పడగొట్టిన శ్రీ చరణికి, 3 వికెట్లు తీసిన దీప్తి శర్మ చక్కటి సహకారం అందించింది. దీంతో శ్రీలంక జట్టు సరిగ్గా 20 ఓవర్లలో 111 పరుగులకు ఆలౌట్ అయింది. ఈ విజయంతో భారత మహిళల జట్టు ఆసియా కప్‌ను గర్వంగా ముద్దాడింది. టీమిండియా మహిళల జట్టు ఇప్పటివరకు మొత్తం 8 సార్లు ఆసియా కప్ టైటిల్‌ను గెలుచుకుంది. అందులో వన్డే ఫార్మాట్ లో 4 సార్లు, టీ20 ఫార్మాట్ లో 4 సార్లు టైటిల్ గెలిచింది.

## నాపై జాలి చూపిస్తే నచ్చదు



భారత మహిళా క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మందాన తన క్రికెట్ కెరీర్‌లోని అత్యంత కఠినమైన రోజులు.. వ్యక్తిగత ఎమోషనల్ లైఫ్ జర్నీ గురించి తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు షేర్ చేసారు. పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో హార్డెస్ట్ డేస్ గురించి ప్రశ్నించగా స్మృతి రియాక్షన్ ఆసక్తిని కలిగించింది. ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్లలో ఒకరిగా రాణిస్తున్న ఈ మహిళా క్రికెటర్ తన కెరీర్‌లో ఎదురైన ఇబ్బందికర క్షణాలు, విమర్శలు.. తన లైఫ్ రూల్స్ గురించి ఓపెన్‌గా ఈ పాడ్ కాస్ట్ లో మాట్లాడారు. మైదానంలో ఎంత దూకుడుగా ఉంటారో... వ్యక్తిగత జీవితంలోనూ అంతే ఆత్మవిశ్వాసంతో ఉంటానని స్పష్టం చేశారు. తాను తీవ్రమైన బాధలో ఉన్నప్పుడు ఎవరికీ కనిపించకుండా ఒంటరిగా గడపడానికి ఇష్టపడతానని.. కానీ ఇతరుల నుంచి వచ్చే జాలిని మాత్రం ఏమాత్రం సహించలేనని స్మృతి పేర్కొన్నారు. --నాకు సింపతీ (సహానుభూతి-జాలి) అంటే అసహ్యం. ఎవరైనా వచ్చి --ఓహ్, నువ్వు ఔట్ అయ్యావా?-- అంటూ జాలిగా చూడటం నాకు నచ్చదు. నన్ను ఎప్పుడూ ఒక -బెచారి- (అబల)లా చూడకండి.. నేను చాలా స్ట్రాంగ్-- అని ఆమె బోల్డ్‌గా చెప్పారు. తనలోని బాధను ఎవరి ముందూ ప్రదర్శించడానికి ఇష్టపడనని.. అందరూ తనను ఒక సంతోషకరమైన వ్యక్తిలాగే చూడాలని కోరుకున్నారు. తన వ్యక్తిగత విషయాలు , కుటుంబ నేపథ్యం గురించి ఇంటర్వ్యూలలో ఎందుకు మాట్లాడననే దానిపై కూడా ఆమె స్పష్టతనిచ్చారు. తన కష్టాల గురించి చెప్పి ఇతరుల నుంచి సానుభూతి పొందాలని తాను ఎప్పుడూ కోరుకోలేదని స్మృతి తెలిపారు.

## బాక్స్ బయటి నుంచి మెస్సీ గోల్

మేజర్ లీగ్ సాకర్‌లో అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ మరోసారి తన మాయాజాలాన్ని ప్రదర్శించాడు. నాష్‌విల్లే ఎస్సీతో జరిగిన మ్యాచ్‌లో పెనాల్టీ బాక్స్ బయటి నుంచి అద్భుతమైన గోల్ కొట్టి తన జట్టు ఇంటర్ మయామిని ఆధిక్యంలో నిలిపాడు. అయినప్పటికీ, ఈ మ్యాచ్‌లో మయామికి విజయం దక్కలేదు. ఆఖరి నిమిషంలో నాష్‌విల్లే గోల్ చేయడంతో మ్యాచ్ 2-2తో డ్రాగా ముగిసింది. నిన్న జరిగిన ఈ మ్యాచ్ ఆరంభంలోనే నాష్‌విల్లే దూకుడు కనబరిచింది. ఆట మొదలైన నాలుగో నిమిషంలోనే సామ్ సరిడ్జ్ గోల్ చేసి నాష్‌విల్లేకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. అయితే, ఇంటర్ మయామి వెంటనే తేరుకుంది. 19వ నిమిషంలో మెస్సీ కొట్టిన కార్నర్ కిక్‌ను అడ్డుకోబోయిన నాష్‌విల్లే డిఫెండర్ రీడ్ బేకర్-వైటింగ్, పొరపాటున బంతిని తమ సొంత గోల్ పోస్టులోకి పంపడంతో స్కోరు 1-1తో సమమైంది. రెండో అర్ధభాగంలో మెస్సీ తన మార్క్ ఆటతో అభిమానులను ఉర్రూతలూగించాడు. 62వ నిమిషంలో సహచర ఆటగాడు రోడ్రిగో డి పాల్ నుంచి పాస్ అందుకున్న మెస్సీ, పెనాల్టీ ఏరియా బయటి నుంచి తన ఎడమ కాలితో కొట్టిన అద్భుతమైన షాట్ నేరుగా గోల్ నెట్‌లోకి దూసుకెళ్లింది. ఈ గోల్‌తో ఇంటర్ మయామి 2-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ సీజన్‌లో మెస్సీకి ఇది 19వ గోల్ కాగా, టాప్ స్కోరర్‌గా తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. 2023లో మయామి జట్టులో చేరినప్పటి నుంచి నాష్‌విల్లేపై ఆడిన 14 మ్యాచ్‌లలో మెస్సీకి ఇది 17వ గోల్ కావడం గమనార్హం. మ్యాచ్ మయామి గెలుస్తుందని అంతా భావిస్తున్న తరుణంలో నాష్‌విల్లే అనూహ్యంగా పుంజుకుంది. ఇంజురీ టైమ్‌లో సామ్ సరిడ్జ్ మరోసారి గోల్ చేసి స్కోరును 2-2తో సమం చేశాడు. దీంతో గెలుపు అంచుల వరకు వచ్చి మయామి డ్రాతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.



## మోదీజీ.. హ్యాట్సాఫ్: రవిశాస్త్రి



భారత క్రికెట్ జట్టు మాజీ కోచ్, ప్రముఖ వ్యాఖ్యాత రవిశాస్త్రి ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రశంసల వర్షం కురిపించాడు. ఢిల్లీ వేదికగా జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ ప్రదర్శిస్తున్న అంతర్జాతీయ దౌత్యనీతిని కొనియాడాడు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఓ ఆసక్తికర పోస్ట్ చేశాడు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో కలిసి ప్రధాని మోదీ మొక్కలు నాటుతున్న ఫొటోను రవిశాస్త్రి పంచుకున్నాడు. సదస్సు జరుగుతున్న 'భారత్ మండపం'లో ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ ఫొటోను షేర్ చేస్తూ.. "ఒక భారతీయుడిగా నేనెప్పుడూ ఇంత గర్వంగా ఫీల్ అవ్వలేదు. అధ్యక్షుడు పుతిన్, అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, మన అద్భుతమైన ప్రధాని నరేంద్ర మోదీ అంతా మాతృభూమి భారత్‌లో ఒకేచోట ఉన్నారు. ఇది మునుపెన్నడూ చూడని అంతర్జాతీయ దౌత్యం. మోదీ జీ.. మీకు నా హ్యాట్సాఫ్" అంటూ తన పోస్టులో పేర్కొన్నాడు. భారత్ అధ్యక్షతన న్యూఢిల్లీలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో 18వ బ్రిక్స్ సదస్సు జరుగుతోంది. "స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" అనే థీమ్‌తో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. సభ్య దేశాలతో పాటు భాగస్వామ్య దేశాల అధినేతలు ఇందులో పాల్గొన్నారు. సదస్సులో భాగంగా నిన్న బ్రిక్స్ నేతలు 'న్యూఢిల్లీ డిక్లరేషన్ 2026'ను ఆమోదించారు.

## అభిషేక్ శర్మ.. 6000

భారత యువ సంచలనం, విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ టీ20 క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ ఫార్మాట్‌లో బంతుల పరంగా అత్యంత వేగంగా 6,000 పరుగులు పూర్తి చేసిన రెండో బ్యాటర్‌గా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. అంతేకాకుండా, ఈ ఘనత సాధించిన మొట్టమొదటి ఆసియా ఆటగాడిగానూ నిలిచాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో ఆదివారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో అభిషేక్ ఈ అరుదైన మైలురాయిని అందుకున్నాడు. తన టీ20 కెరీర్‌లో 6,000 పరుగుల మార్కును చేరుకోవడానికి అతడికి కేవలం 3,420 బంతులు మాత్రమే అవసరమయ్యాయి. ఈ జాబితాలో న్యూజిలాండ్‌కు చెందిన విధ్వంసకర ఓపెనర్ ఫిన్ అలెన్ (3,386 బంతులు) మాత్రమే అభిషేక్ కంటే ముందున్నాడు. ఈ క్రమంలో అభిషేక్ శర్మ.. ఆండ్రీ రస్సెల్ (3,550 బంతులు), టిమ్ డేవిడ్ (3,681 బంతులు), విల్ జాక్స్, ఫిల్ సాల్ట్ (3,857 బంతులు) వంటి మేటి హార్డ్ హిట్టర్లను వెనక్కి నెట్టడం విశేషం.

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

## భారత్-చైనా బంధం కొత్తదారులు తొక్కేనా?

సరిహద్దులో ఉద్రిక్తతలు.. వాణిజ్యంలో అసమతుల్యత.. వ్యూహాత్మకంగా పరస్పర పోటీ.. ఇవన్నీ ఉన్నప్పటికీ భారత్-చైనా సంబంధాలు మళ్లీ కొత్త మలుపు తిరుగుతున్నాయా? న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సు ఈ ప్రశ్నకు అవుననే సంకేతాలు ఇచ్చింది. రెండేళ్లుగా క్రమంగా కరిగిపోతున్న మంచు మరింత కరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఈ పరిణామాన్ని పూర్తి స్థాయి స్నేహానికి నాందిగా భావించడం తొందరపాటు. ఇది పరస్పర ప్రయోజనాలను గుర్తించిన రెండు శక్తుల మధ్య మొదలైన వ్యూహాత్మక సర్దుబాటు. 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత భారత్-చైనా సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. సరిహద్దులో సైనిక మోహరింపులు పెరిగాయి. దౌత్య సంబంధాల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. పెట్టుబడులు, సాంకేతిక రంగాల్లో భారత్ కఠిన వైఖరి అవలంబించింది. ప్రజల మధ్య సంబంధాలు కూడా దెబ్బతిన్నాయి. అయితే 2024లో సరిహద్దు ఉద్రిక్తతలను తగ్గించే ఒప్పందం తర్వాత పరిస్థితి క్రమంగా మారింది. 2025లో మోదీ-జిన్‌పింగ్ భేటీలు సంబంధాల పునరుద్ధరణకు రాజకీయ సంకేతాలిచ్చాయి. ఇప్పుడు 2026 బ్రిక్స్ సదస్సు ఆ ప్రక్రియకు మరో అడుగు ముందుకు వేసింది. బ్రిక్స్ వేదికపై మోదీ-జిన్‌పింగ్ సమావేశం ఈ మార్పులో కీలకం. పరస్పర గౌరవం, పరస్పర సున్నితత్వం, పరస్పర ప్రయోజనాల ఆధారంగా సంబంధాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరాన్ని భారత్ స్పష్టం చేసింది. మరోవైపు చైనా కూడా భారత్‌ను ప్రత్యర్థిగా కాకుండా భాగస్వామిగా చూడాలని, అభివృద్ధి అవకాశాలను పరస్పరం ముప్పుగా భావించకూడదని చెబుతోంది. సరిహద్దు సమస్యను పరిష్కరించాల్సిన అవసరాన్ని ఇరువైపులా అంగీకరించడం కూడా సానుకూల పరిణామమే. అయితే ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. మాటలు మారడం సులభం. నమ్మకం తిరిగి రావడం అంత సులభం కాదు. సరిహద్దు విషయంలో చైనా ఎంతవరకు వెనక్కి తగ్గుతుంది? అరుణాచల్‌ప్రదేశ్‌పై తన వైఖరిని మార్చుకుంటుందా? వాస్తవ నియంత్రణ రేఖ వద్ద శాంతిని శాశ్వతంగా కొనసాగించేందుకు సిద్ధమవుతుందా? మరోవైపు చైనా నుంచి దిగుమతులపై ఆధారపడుతున్న భారత పరిశ్రమకు సమతుల్యమైన వాణిజ్య వాతావరణం కల్పించేందుకు బీజింగ్ ముందుకు వస్తుందా? రక్షణ, టెలికాం, కీలక సాంకేతిక రంగాల్లో పరస్పర అనుమానాలు తగ్గుతాయా? ఇవే అసలు పరీక్షలు. వాణిజ్య రంగంలో రెండు దేశాలకు ఒకరినొకరు పూర్తిగా విస్మరించే అవకాశం లేదు. చైనా భారత్‌కు కీలక దిగుమతి భాగస్వామిగా కొనసాగుతోంది. భారత తయారీ రంగానికి అవసరమైన అనేక పారిశ్రామిక వస్తువులు, యంత్రాలు, ఎలక్ట్రానిక్ భాగాలు చైనా నుంచి వస్తున్నాయి. అదే సమయంలో భారత్ కూడా ప్రపంచంలోని అతిపెద్ద వినియోగ మార్కెట్లలో ఒకటి. అంటే రాజకీయ విభేదాలు ఉన్నా ఆర్థిక వాస్తవాలు రెండు దేశాలను ఒకదానికొకటి దగ్గర చేస్తూనే ఉంటాయి. ఇక బ్రిక్స్ కూడా ఈ మార్పుకు మరో కారణం. అమెరికా-చైనా పోటీ, పశ్చిమాసియాలో యుద్ధాలు, వాణిజ్య ఆంక్షలు, సరఫరా గొలుసుల అస్థిరత వంటి పరిణామాల మధ్య ప్రపంచం వేగంగా బహుళ ధ్రువ వ్యవస్థ వైపు కదులుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ దక్షిణ దేశాల్లో భారత్, చైనాల పాత్ర పెరుగుతోంది. బ్రిక్స్‌ను మరింత బలోపేతం చేయాలంటే ఈ రెండు దేశాల మధ్య కనీస స్థాయి స్థిరత్వం అవసరం. వచ్చే ఏడాది బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు చైనాకు వెళ్లనున్న నేపథ్యంలో పరస్పర సమన్వయం మరింత అవసరం కానుంది. అయితే భారత్‌కు ఒక స్పష్టమైన వ్యూహం ఉండాలి. చైనాతో సంబంధాలు మెరుగుపడుతున్నాయన్న కారణంతో జాతీయ భద్రత విషయంలో రాజీ పడకూడదు. అమెరికాతో సంబంధాలు ఉన్నాయన్న కారణంతో చైనాతో శాశ్వత శత్రుత్వం కొనసాగించాల్సిన అవసరమూ లేదు. భారత విదేశాంగ విధానానికి బలం ఇదే వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి. ఎవరి ఒత్తిడికీ లోబడకుండా, భారత ప్రయోజనాలే కేంద్రంగా సంబంధాలను నిర్ణయించుకోవాలి. చైనాకు కూడా ఇదే వాస్తవం అర్థం కావాలి. పొరుగు దేశాన్ని ఒత్తిడిలో ఉంచుతూ అదే సమయంలో స్నేహం కోరుకోవడం సాధ్యం కాదు. సరిహద్దులో శాంతి, వాణిజ్యంలో సమతుల్యత, పరస్పర గౌరవం ఉంటేనే రాజకీయ విశ్వాసం పెరుగుతుంది. భారత భద్రతా ఆందోళనలను గౌరవించకుండా కేవలం బ్రిక్స్, బహుళ ధ్రువ ప్రపంచం గురించి మాట్లాడటం వల్ల ప్రయోజనం ఉండదు. మొత్తానికి బ్రిక్స్ సదస్సు భారత్-చైనా సంబంధాలకు కొత్త తలుపు తెరిచింది. ఆ తలుపు గుండా రెండు దేశాలు ముందుకు నడుస్తాయా? లేక పాత అనుమానాల దగ్గరే ఆగిపోతాయా? అన్నది ఇక చర్యలపై ఆధారపడి ఉంటుంది.



# నేను వినాయకుడిని..!

## .......బరువెక్కిన హృదయంతో.......

'నా ప్రియమైన భక్తులారా..

నా పండుగ వస్తోందంటే కైలాసంలో ఒకప్పుడు నేను ఎంతో మురిసిపోయేవాడిని. గరిక పూజలు, మట్టితో చేసిన నా మూర్తులు, పసిపిల్లల నవ్వుల మధ్య నా నవరాత్రులు అత్యంత ప్రశాంతంగా గడిచేవి. కానీ, ఇప్పుడు మీ వీధుల్లోకి రావాలంటేనే నాకు భయం వేస్తోంది. మీరు నా కోసం చేస్తున్న ఉత్సవాలు చూస్తుంటే నా హృదయం బరువెక్కుతోంది. నా రూపమే ఒక ప్రకృతి సందేశం. ఏనుగు ముఖం ప్రకృతిలోని జీవజాలాన్ని, మూషిక వాహనం అట్టడుగు జీవుల పట్ల సహానుభూతిని సూచిస్తుంది. అలాంటిది నేడు నన్ను పర్యావరణ విధ్వంసానికి ప్రతీకగా మారుస్తుండటం నన్ను తీవ్రంగా కలచివేస్తోంది. ఎవరు పెద్ద విగ్రహం పెట్టారన్న పోటీలు నాకు ఎందుకు? ప్లాస్టర్ ఆఫ్ పారిస్, విషపూరిత రసాయన రంగులతో నన్ను విగ్రహంగా మలిచే ప్రతిసారీ నా ఊపిరి ఆగిపోతోంది. నిమజ్జనం పేరిట ఆ విషాన్ని గంగమ్మ ఒడిలో కలిపేస్తుంటే మూగజీవాలు విలవిల్లాడుతున్నాయి. మట్టి నుంచే పుట్టి, మట్టిలోనే కలవాలన్న సృష్టి ధర్మాన్ని నా పండుగ రోజే మీరు మంటగలుపుతున్నారు. ఇక మీ పందిళ్ల సంస్కృతిని చూస్తే బాధతో పాటు ఆందోళన కలుగుతోంది. ఒకప్పుడు భక్తికి, ప్రశాంతతకు నిలయంగా ఉన్న వేదికలు.. నేడు డీజే మోతలు, వికృత నృత్యాలకు అడ్డాలుగా మారుతున్నాయి. చెవులు చిల్లులు పడే ఆ శబ్ద కాలుష్యంలో నా నామస్మరణ ఏది? విరాళాల పేరిట వేధించడం, నా ఉత్సవాన్ని రాత్రిపూట జల్సాలు చేసుకునేందుకు ఒక అవకాశంగా మార్చుకోవడం చూస్తుంటే.. మీలో భక్తి ఎక్కడుందో నాకర్థం కావడం లేదు. భక్తులారా.. పండుగ అంటే ఆడంబరం కాదు, అంతర్మథనం. దయచేసి మట్టితో నన్ను మలచండి. మీ వాకిట్లోనే ఒక చిన్న తొట్టిలో నన్ను నిమజ్జనం చేసి, అందులో ఓ విత్తనం నాటి మొక్కగా నన్ను పెంచండి. సమాజానికి మేలు చేసే సేవా కార్యక్రమాలను ఉత్సవాలుగా మార్చండి. మీ మనసులోని కల్మషాన్ని నిమజ్జనం చేయండి. అప్పుడే నా రాకకు అర్థం, మీ పూజకు సార్థకత. నా పండుగను ప్రకృతికి వరంలా మార్చండి, శాపంగా మార్చకండి.'

ఇదే నిజమైన నైవేద్యం..

విఘ్నేశ్వరుడి సందేశం స్పష్టం. ఆర్భాటాల కోసం పర్యావరణాన్ని బలిచేయడం మానుకుందాం. డీజేల మోతలను కట్టిపెట్టి, భక్తిపూర్వక వాతావరణంలో పండుగను జరుపుకుందాం. మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని రక్షిద్దాం. ఇదే మనం ఆ గణనాథునికి అర్పించే నిజమైన నైవేద్యం.



ముత్యాల సురేశ్
సీనియర్ జర్నలిస్ట్
9912715325

# బ్రిక్స్ దెబ్బ.. డాలర్ కోట బద్దలు!



ఢిల్లీ వేదికగా జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిణామాల్లో భారత్ పాత్రను మరోసారి ముందుకు తెచ్చింది. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాతో మొదలైన ఈ వేదిక ఇప్పుడు ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇండోనేషియా చేరికతో విస్తరించింది. భాగస్వామ్య దేశాల చేరికతో పరిధి మరింత పెరిగింది. భిన్న ప్రాంతాలు, భిన్న ప్రయోజనాలు, భిన్న రాజకీయ నేపథ్యాలున్న దేశాలను ఒకే చర్చా బల్లపైకి తీసుకురావడమే బ్రిక్స్ బలం. ఈ విస్తరణలో భారత్ నాయకత్వం సాధారణ అధ్యక్షత కాదు.. మారుతున్న ప్రపంచానికి తన మాట వినిపించే అవకాశం. బ్రిక్స్ సమావేశం, ఢిల్లీ డిక్లరేషన్, డాలర్ ఆధిపత్యం వంటి మాటలు వినగానే విషయం పెద్ద దేశాల రాజకీయాలకే పరిమితమైనట్టనిపిస్తుంది. కానీ దాని తుది ప్రభావం సామాన్యుడి ఇంటి గడప దాటాల్సిందే. రూపాయి విలువ, చమురు ధర, ఎరువుల ఖర్చు, మందుల ధర, ఎలక్ట్రానిక్ వస్తువుల వ్యయం, రవాణా భారం.. ఇవన్నీ ప్రపంచ ఆర్థిక పరిణామాలతో ముడిపడి ఉన్నాయి. అంతర్జాతీయ లావాదేవీల్లో డాలర్‌పై ఆధారం కొంత తగ్గి, స్థానిక కరెన్సీల వినియోగం పెరిగితే వ్యాపార వ్యయాలు తగ్గే అవకాశం ఉంటుంది. ఆ ప్రయోజనం చివరికి వినియోగదారుడి జేబులో కనిపించాలి. అంతర్జాతీయ వేదికపై చప్పట్లు కొట్టించుకోవడం కంటే ఇంటి బడ్జెట్‌లో భారం తగ్గించడం గొప్ప దౌత్య ఫలితం. ప్రపంచ పాలనా వ్యవస్థలో మార్పు కావాలన్న డిమాండ్ చాలాకాలంగా ఉంది. జనాభా, ఆర్థిక పరిమాణం, వాణిజ్య శక్తి పెరిగిన అభివృద్ధి చెందుతున్న దేశాలకు అంతర్జాతీయ నిర్ణయ ప్రక్రియలో తగిన ప్రాతినిధ్యం లేదన్న అసంతృప్తి ఉంది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి సంస్కరణ నుంచి ప్రపంచ ఆర్థిక సంస్థల్లో ప్రాతినిధ్యం పెంపు వరకు ఇదే వాదన వినిపిస్తోంది. బ్రిక్స్ విస్తరణతో ఆ స్వరానికి కొత్త బలం వచ్చింది. భారత్ ఈ మార్పు డిమాండ్‌ను ముందుకు నడిపే దేశంగా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలి. పశ్చిమాసియాలోని ఉద్రిక్తతలు మన ఇంటి వంటగదికి కూడా చేరతాయి. చమురు ధరలు పెరిగితే రవాణా ఖర్చు పెరుగుతుంది. రవాణా ఖర్చు పెరిగితే సరుకుల ధరలు కదులుతాయి. ఎరువులు, ఆహారం, మందులు, ముడిసరుకుల ధరలపై ప్రభావం పడుతుంది. ఒక సముద్ర మార్గంలో అంతరాయం ఏర్పడినా దాని అలజడి వేల కిలోమీటర్ల దూరంలోని మార్కెట్‌ను తాకుతుంది. అందుకే బ్రిక్స్‌లో శాంతి, పౌరుల రక్షణ, వాణిజ్య మార్గాల భద్రతపై వ్యక్తమైన ఆందోళనకు ఆర్థిక ప్రాధాన్యమూ ఉంది. యుద్ధం బాంబులతోనే కాదు.. బిల్లులతోనూ సామాన్యుడిని తాకుతుంది.

ఢిల్లీ సమావేశంపై ప్రపంచ దృష్టి ఎక్కువగా నిలిచిన అంశాల్లో డాలర్ ఆధిపత్యం ఒకటి. అయితే వాస్తవాన్ని అతిశయోక్తి లేకుండా చూడాలి. బ్రిక్స్ ఉమ్మడి కరెన్సీని ప్రకటించలేదు. డాలర్‌ను ఒక్కసారిగా పక్కన పెట్టే నిర్ణయమూ తీసుకోలేదు. కానీ అంతర్జాతీయ వాణిజ్యంలో ప్రతి అడుగుకూ డాలర్‌పై ఆధారపడాల్సిన అవసరాన్ని కొంత తగ్గించే మార్గాలపై చర్చకు బలం వచ్చింది. స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం, సరిహద్దు చెల్లింపుల సౌలభ్యం, సభ్య దేశాల చెల్లింపు వ్యవస్థల అనుసంధానం.. ఇవే ఇప్పుడు కీలక అడుగులు. డాలర్‌కు ప్రత్యామ్నాయం అంటే రేపే కొత్త నోటు పుట్టడం కాదు; ముందుగా ప్రత్యామ్నాయ లావాదేవీ వ్యవస్థలు బలపడటం. ఇక్కడ భారత్ యూపీఐ సామర్థ్యం ప్రత్యేకంగా నిలుస్తోంది. దేశంలో కోట్లాది మంది రోజువారీ చెల్లింపులకు ఉపయోగిస్తున్న డిజిటల్ వ్యవస్థకు అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు పెరుగుతోంది. బ్రిక్స్ దేశాల చెల్లింపు వ్యవస్థల మధ్య అనుసంధానం పెరిగితే వాణిజ్య చెల్లింపులు వేగవంతం కావచ్చు. చిన్న సంస్థలకు విదేశీ లావాదేవీల ఖర్చు, సమయం కొంత తగ్గవచ్చు. అయితే ప్రతి దేశానికీ తన బ్యాంకింగ్ నియమాలు, కరెన్సీ విధానం, సైబర్ భద్రతా ప్రమాణాలు ఉన్నాయి. కాబట్టి ఇది ఒక్కరోజులో జరిగే మార్పు కాదు. కానీ అడుగు పడితే మార్గం తెరుచుకుంటుంది. స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం పెరిగితే రూపాయికి కొత్త అవకాశాలు రావచ్చు. ప్రతి లావాదేవీకి డాలర్‌ను మధ్యవర్తిగా ఉపయోగించాల్సిన అవసరం తగ్గితే ఎగుమతిదారులకు కొంత సౌలభ్యం కలగవచ్చు. విదేశీ మారకపు వ్యయాలు తగ్గే అవకాశం ఉంది. చిన్న, మధ్య తరహా సంస్థలకు ఇది ఉపయోగపడొచ్చు. అయితే డాలర్‌పై ఆధారం తగ్గడం వేరు; రూపాయి ప్రపంచ రిజర్వు కరెన్సీగా మారడం వేరు. రూపాయికి అంతర్జాతీయ స్థాయి రావాలంటే బలమైన ఎగుమతులు, స్థిరమైన ఆర్థిక వ్యవస్థ, లోతైన ఆర్థిక మార్కెట్లు, పెట్టుబడిదారుల విశ్వాసం అవసరం. నినాదం కాదు.. నమ్మకమే కరెన్సీకి బలం. బ్రిక్స్ విస్తరణను భారత్ దౌత్య విజయంగా మాత్రమే కాకుండా మార్కెట్ అవకాశంగా చూడాలి. వ్యవసాయ ఉత్పత్తులకు కొత్త ఎగుమతి గమ్యాలు లభిస్తే రైతుకు మంచి ధర దక్కే అవకాశం ఉంటుంది. ఔషధాలు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక సేవలకు డిమాండ్ పెరిగితే పరిశ్రమలకు కొత్త ఆర్డర్లు రావచ్చు. పరిశ్రమలు పెరిగితే ఉపాధి అవకాశాలు విస్తరించవచ్చు. బ్రిక్స్ చర్చల అసలు ఫలితం ఢిల్లీలోని సమావేశ మందిరంలో కనిపించదు. అది రైతు పొలంలో, చిన్న వ్యాపారి దుకాణంలో, యువకుడి ఉద్యోగ పత్రంలో కనిపించినప్పుడే దానికి విలువ.

లిథియం, అరుదైన భూ మూలకాలు, ఇతర కీలక ఖనిజాలు భవిష్యత్తు పరిశ్రమలకు వెన్నెముక. విద్యుత్ వాహనాలు, బ్యాటరీలు, సెమీకండక్టర్లు, ఆధునిక రక్షణ పరికరాల తయారీలో వీటి ప్రాధాన్యం పెరుగుతోంది. సరఫరా కోసం ఒకే దేశంపై ఆధారపడటం వ్యూహాత్మక ప్రమాదం. బ్రిక్స్ దేశాల మధ్య సహకారం పెరిగితే భారత్‌కు సరఫరా భద్రతతోపాటు తయారీ రంగానికి అవకాశాలు పెరుగుతాయి. రేపటి పారిశ్రామిక పోరాటంలో భూమి కింద ఉన్న ఖనిజం కూడా భూమిపై ఉన్న సాంకేతికతంతే విలువైనదే. బ్రిక్స్ విస్తరణతో అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఒక పెద్ద వేదిక ఏర్పడింది. మౌలిక వసతులకు నిధులు, అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్థిక సహకారం, స్థానిక కరెన్సీల్లో లావాదేవీలు, డిజిటల్ ప్రజా మౌలిక వసతుల అనుభవాల పంచుకోవడం వంటి అంశాలు ఈ దేశాలకు ఉపయోగపడవచ్చు. భారత్ తన డిజిటల్ పాలన, ప్రజా చెల్లింపుల వ్యవస్థ, ప్రజా సేవల సాంకేతిక అనుభవాన్ని ఇతర దేశాలతో పంచుకుంటే అది ఆర్థిక ప్రయోజనంతోపాటు భారత ప్రభావాన్ని పెంచుతుంది. రష్యాతో వ్యూహాత్మక సంబంధాలు కొనసాగిస్తూనే అమెరికా, యూరప్‌తో వాణిజ్య బంధాలను బలోపేతం చేయడం; చైనాతో పోటీ ఉన్నప్పటికీ బహుపాక్షిక వేదికల్లో సంభాషణ కొనసాగించడం; మధ్యప్రాచ్యంలో విభేదాలున్న దేశాలతోనూ సంబంధాలు కొనసాగించడం.. భారత్ విదేశాంగ విధానంలోని సమతుల్యతను చూపుతున్నాయి. ఒకే శిబిరంలో నిలబడకుండా జాతీయ ప్రయోజనాన్ని ముందుకు పెట్టే స్వతంత్ర దౌత్యమే భారత్‌కు బలం. బ్రిక్స్ వేదికను కూడా ఇదే దృష్టితో ఉపయోగించాలి. ఎవరి మీద గెలవడం కంటే.. మన ప్రయోజనాన్ని నిలబెట్టుకోవడమే అసలు గెలుపు. అంతర్జాతీయ వేదికపై సాధించిన విజయం దేశీయ ఆర్థిక వ్యవస్థతో ముడిపడకపోతే అది వార్తగా మిగిలిపోతుంది. దిగుమతి వ్యయం తగ్గితే ఆ ప్రయోజనం వినియోగదారుడికి చేరాలి. ఎగుమతులు పెరిగితే రైతు, తయారీదారు లాభపడాలి. పెట్టుబడులు వస్తే పరిశ్రమలు రావాలి. పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు రావాలి. సాంకేతిక సహకారం జరిగితే యువతకు నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు పెరగాలి. ఇదే దౌత్యానికి ప్రజా కొలమానం. దేశ విదేశాంగ విధానానికి చివరి చిరునామా కూడా ప్రజల సంక్షేమమే కావాలి. అసలు పరీక్ష ఢిల్లీలో ముగియలేదు.. అక్కడి నుంచే మొదలైంది. డిక్లరేషన్‌లు కార్యాచరణగా మారాలి. కార్యాచరణ పెట్టుబడులుగా మారాలి. పెట్టుబడులు పరిశ్రమలుగా మారాలి. పరిశ్రమలు ఉద్యోగాలుగా మారాలి. రైతు ఉత్పత్తికి నిల్వ, ప్రాసెసింగ్, రవాణా సదుపాయాలు మెరుగుపడాలి. చిన్న వ్యాపారికి చౌక రుణం, సరళమైన నిబంధనలు అందాలి. యువతకు ప్రపంచ మార్కెట్‌కు సరిపోయే నైపుణ్యాలు రావాలి. అప్పుడే ఢిల్లీ తీర్మానాల ప్రతిధ్వని దేశంలోని ప్రతి ఇంటికీ చేరుతుంది. ఒక్క సమావేశంతో డాలర్ పట్టు విరగదు. ఒక్క డిక్లరేషన్‌తో రూపాయి ప్రపంచ కరెన్సీ కాదు. కానీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఒకే శక్తికేంద్రంపై ఆధారపడకుండా కొత్త మార్గాలను వెతికే ప్రక్రియకు ఢిల్లీ బలం ఇచ్చింది. స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం, డిజిటల్ చెల్లింపుల అనుసంధానం, కొత్త మార్కెట్లు, కీలక ఖనిజాల భాగస్వామ్యం.. ఇవి భారత్‌కు అవకాశాలే. వాటిని అవకాశాలుగానే వదిలేస్తామా? లేక ప్రజల జీవితాల్లో ఫలితాలుగా మలుస్తామా? అదే అసలు పరీక్ష. దిక్సూచి దిశను చూపిస్తుంది. గమ్యాన్ని మాత్రం అడుగులే చేరుస్తాయి. ఢిల్లీ చూపించిన దిశను ప్రజల ఆదాయం, ఉపాధి, ధరల స్థిరత్వం, వ్యాపార అవకాశాలుగా మార్చగలిగితేనే బ్రిక్స్‌లో భారత్ నాయకత్వానికి అసలైన అర్థం ఉంటుంది. ప్రపంచ వేదికపై భారత్ మాటకు బలం రావడం ఒక విజయం. ఆ బలం సామాన్యుడి జీవితంలో కనిపించడం అంతకంటే పెద్ద విజయం.



శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్టు
9133947176

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.